www.epaper.asthram.com

# సామాన్యుడి అస్త్రం

తెలుగు దినపత్రిక

బుధవారం 31 డిసెంబర్ 2025

సంగారెడ్డి సంచిక : 176 సంపుటి : 1 పేజీలు : 8 వెల : రూ. 5/-

## రెండేళ్ల గరిష్టానికి పారిశ్రామికోత్పత్తి

దేశ పారిశ్రామికోత్పత్తి వృద్ధి నవంబర్‌లో 6.7 శాతం వృద్ధిని నమోదు చేసింది. ఇది రెండేళ్ల గరిష్ట స్థాయి. మైనింగ్, తయారీ వంటి రంగాల్లో మెరుగైన పనితీరు కారణంగా పారిశ్రామికోత్పత్తి గణనీయంగా పుంజుకుందని జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్‌ఎస్‌ఓ) సోమవారం ప్రకటనలో వెల్లడించింది. గతేడాది ఇదే నెలలో పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపీ) 5 శాతం పెరిగింది. ఎన్‌ఎస్‌ఓ గణాంకాల ప్రకారం, సమీక్షించిన నెలలో తయారీ రంగం 8 శాతం పుంజుకుంది. ఇది గతేడాది నవంబర్‌లో 5.5 శాతంగా ఉంది. వర్షాకాలం ముగియడంతో పాటు ఇనుప ఖనిజం వంటి లోహ ఖనిజాల ఉత్పత్తి పెరగడం వల్ల మైనింగ్ ఉత్పత్తి ఈ నవంబర్‌లో 5.4 శాతంగా నమోదైంది.



# భారత్ సంస్కరణల ఎక్స్‌ప్రెస్ ఎక్కింది

## ప్రధాని మోదీ 2025 రివైండ్-ఈ మేరకు సోషల్ మీడియాలో పోస్టు

సంస్కరణల ఎక్స్‌ప్రెస్‌లో భారత్ ప్రయాణిస్తోంది

ఈ క్రమంలో భారత్‌ను ప్రపంచం ఆశతో, విశ్వాసంతో చూస్తోంది

ఈ సంస్కరణల ఎక్స్‌ప్రెస్ ప్రాథమిక ఇంజిన్ దేశ జనాభా, యువత, ప్రజల అజేయ స్ఫూర్తి అని తాను చాలా మందికి చెబుతున్నా

జీఎస్టీ సంస్కరణలతో కోట్లాది కుటుంబాలకు ఉపశమనం :

3లో..



### బనకచర్ల ప్రాజెక్టుకు వ్యతిరేకంగా

## అసెంబ్లీలో తీర్మానం చేయాలి

ఏపీ నిర్మిస్తోన్న గోదావరి - బనకచర్ల ప్రాజెక్ట్‌కు సీడబ్ల్యూసీ అనుమతి వచ్చింది

తెలంగాణ రాష్ట్ర అభిప్రాయం లేకుండా సీడబ్ల్యూసీ ఎలా అనుమతి ఇస్తోంది

గోదావరి బనకచర్ల ప్రాజెక్టును నిర్మిస్తే తెలంగాణ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరుగుతోంది

హైదరాబాద్

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. ఉద్యమ ద్రోహి, జలదోపిడి ద్రోహి రేవంత్‌రెడ్డినే అని షాకింగ్ కామెంట్స్ చేశారు. ఇవాళ(మంగళవారం) తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు హరీశ్‌రావు. ఏపీ నిర్మిస్తోన్న గోదావరి - బనకచర్ల ప్రాజెక్ట్‌కు సీడబ్ల్యూసీ అనుమతి వచ్చిందని ప్రస్తావించారు. తెలంగాణ రాష్ట్ర అభిప్రాయం లేకుండా సీడబ్ల్యూసీ ఎలా అనుమతి ఇస్తోందని ప్రశ్నల వర్షం కురిపించారు. గోదావరి - మిగతా3లో

# స్మార్ట్ గవర్నెన్స్‌కు అధికారులు మారాలి



- హైడ్రా, జీహెచ్ఎంసీ, వాటర్‌వర్క్స్ విభాగాలు నాలాల పూడిక తీత పనులు జనవరి నుంచి ప్రారంభించాలి
- నగరంలో వీధి దీపాలు సరిపడా ఉండేలా చూసుకోవాలి
- రాష్ట్రాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేసుకోవాలనే తెలంగాణ రైజింగ్ - 2047 విజన్ డాక్యుమెంట్‌ను విడుదల చేసుకున్నాం
- పరిపాలనను పట్టాలెక్కించాలనేదే తమ ఆలోచన

హైదరాబాద్

జోనల్ కమిషనర్లు ప్రతీ రోజు ఫీల్డ్‌లో ఉండాల్సిందేనని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. అవుటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ ఏరియాను ప్రణాళిక బద్ధంగా అభివృద్ధి చేయాలని తమ ప్రభుత్వం నిర్ణయించిందని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేసుకోవాలనే తెలంగాణ రైజింగ్ - 2047 విజన్ డాక్యుమెంట్‌ను విడుదల చేసుకున్నామని వ్యాఖ్యానించారు. ఇవాళ(మంగళవారం) కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలమెంట్ విభాగం అధికారులతో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షకు సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేశ్‌రంజన్, ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సమీక్షలో కొత్త జోనల్ కమిషనర్లకు ముఖ్యమంత్రి దిశా నిర్దేశం చేశారు. క్యూర్ పరిధిలోని సిటీని 12 జోన్లు, 60 సర్కిళ్లు, 300 వార్డులుగా పునర్వ్యవస్థీకరించామని - మిగతా3లో



## మహిళలకు రక్షణ లేకుండా పోయింది'

- చొరబాట్లతో బెంగాల్ ప్రజల్లో ఆందోళన..
- మమతా ప్రభుత్వంపై నిప్పులు చెరిగిన అమిత్ షా
- చొరబాట్లు ప్రజల్లో అభద్రతా భావాన్ని, ఆందోళనను సృష్టించాయి



## ఫేస్‌బుక్, వాట్సాప్‌లో కొత్తతరం ఏఐ ఏజెంట్స్

- సింగపూర్ స్టార్టప్‌ను సొంతం చేసుకున్న మెటా
- ఏఐ స్టార్టప్ మానుస్‌ను కొనుగోలు చేసిన టెక్ దిగ్గజం మెటా
- 2 బిలియన్ డాలర్లకు పైగా విలువైన డీల్ అని అంచనా
- గూగుల్, ఓపెన్‌ఏఐకి పోటీ ఇచ్చేందుకు మెటా వ్యూహాత్మక అడుగు
- తనంతట తానుగా పనిచేసే ఏఐ ఏజెంట్లను అభివృద్ధి చేసిన మానుస్
- ఫేస్‌బుక్, వాట్సాప్‌లలో ఈ టెక్నాలజీని విలీనం చేయనున్న మెటా
- మెటా వైస్ ప్రెసిడెంట్‌గా చేరనున్న మానుస్ సీఈఓ షావో హాంగ్

### కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను

# ఎండగట్టాలి




- బీఆర్ఎస్ నేతలతో కేసీఆర్ కీలక భేటీ
- ఈ అసెంబ్లీ సమావేశాలను పూర్తిగా ఉపయోగించుకోవాలి
- ప్రభుత్వం చెప్పే ప్రతీ అంశంపై సమాధానంతో సిద్ధంగా ఉండాలి

హైదరాబాద్

బీఆర్ఎస్ నేతలతో మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మంగళవారం సమావేశమయ్యారు. నందినగర్ నివాసంలో జరిగిన ఈ భేటీలో మాజీ మంత్రులు కేటీఆర్ హరీష్ రావు పలువురు బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై నేతలకు గులాబీ బాస్ దిశానిర్దేశం చేశారు. తెలంగాణలో తాజా రాజకీయ పరిణామాలపై చర్చించారు. ప్రధానంగా పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్ట్‌కు సంబంధించి అసెంబ్లీ వేదికగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఎండగట్టాలన్నదే బీఆర్ఎస్ వ్యూహం. ఇందులో భాగంగానే ఈ అసెంబ్లీ సమావేశా లను పూర్తిగా ఉపయోగించుకోవాలని బీఆర్ఎస్ పార్టీ భావిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే పాలమూరు - - మిగతా3లో

# ట్రాఫిక్ కష్టాలు ఉండకూడదు



- ఈ సంక్రాంతికి టోల్ ప్లాజాల వద్ద ఫ్రీ వే!
- పండుగ రద్దీ ఉన్న రోజుల్లో లేన్‌లు మూసే పనులు, భారీ యంత్రాలతో చేసే పనులు చేయొద్దు.
- సంక్రాంతి ముంగిట హైదరాబాద్-విజయవాడ హైవేపై ట్రాఫిక్ కష్టాలు ఉండకూడదు: మంత్రి కోమటిరెడ్డి ఆదేశాలు
- హైవేలపై సంక్రాంతి ట్రాఫిక్ నివారణకు ఉన్నతాధికారులతో మంత్రి కోమటిరెడ్డి సమీక్ష

### జర్నలిస్టులు ఎలాంటి

## అపోహాలు పడొద్దు

- జర్నలిస్టు సంఘాలతో సమావేశమవుతానన్న మంత్రి పొంగులేటి..!
- ప్రభుత్వం విడుదల చేసిన జీవో 252తో తమకు అన్యాయం జరుగుతుందని డెస్క్ జర్నలిస్టులు గడిచిన వారం రోజులుగా ఆందోళన



# ఫేస్‌బుక్, వాట్సాప్‌లో కొత్తతరం ఏఐ ఏజెంట్స్

టెక్నాలజీ రంగంలో మరో భారీ ఒప్పందం కుదిరింది. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్ మాతృసంస్థ మెటా ప్లాట్‌ఫామ్స్.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) స్టార్టప్ 'మానుస్'ను కొనుగోలు చేసినట్లు అధికారికంగా ప్రకటించింది. ఈ డీల్ విలువ 2 బిలియన్ డాలర్లకు (సుమారు రూ. 16,600 కోట్లు) పైగానే ఉంటుందని టెక్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ కొనుగోలుతో ఏఐ రంగంలో గూగుల్, ఓపెన్‌ఏఐ వంటి సంస్థలకు గట్టి పోటీ ఇవ్వాలని మెటా లక్ష్యంగా పెట్టుకుంది. చైనాకు చెందిన వ్యవస్థాపకులు ప్రారంభించిన మానుస్, ప్రస్తుతం సింగపూర్ కేంద్రంగా పనిచేస్తోంది. ఇది సాధారణ ఏఐ చాట్‌బాట్‌ల లాంటిది కాదు. వినియోగదారుల సూచనలకు స్పందించడమే కాకుండా, తనంతట తానుగా క్లిష్టమైన పనులను పూర్తిచేసే "జనరల్ పర్పస్ అటానమస్ ఏఐ ఏజెంట్ల"ను అభివృద్ధి చేయడంలో ప్రసిద్ధి చెందింది. మార్కెట్ రీసెర్చ్, డేటా విశ్లేషణ, కోడింగ్, ట్రిప్ ప్లానింగ్ వంటి పనులను ఇది మానవ ప్రమేయం లేకుండానే చేయగలదు. ఈ అత్యాధునిక టెక్నాలజీని తమ ఉత్పత్తుల్లో విలీనం



చేయడమే లక్ష్యంగా ఈ కొనుగోలు జరిపినట్లు మెటా ఒక ప్రకటనలో తెలిపింది. "ఏఐ ఏజెంట్లు తదుపరి అతిపెద్ద టెక్నాలజీ మార్పును సూచిస్తున్నాయి. సాఫ్ట్‌వేర్ కేవలం సూచనలకు స్పందించడమే కాకుండా, వినియోగదారుల తరఫున పనులు కూడా చేస్తుంది. ఈ దిశగా మా దీర్ఘకాలిక వ్యూహానికి మానుస్ బృందం పనితీరు సరిగ్గా సరిపోతుంది" అని మెటా వివరించింది. భవిష్యత్తులో ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్‌లలోని 'మెటా ఏఐ' అసిస్టెంట్‌లో ఈ టెక్నాలజీని అందుబాటులోకి తేనున్నారు. ఈ ఒప్పందంపై మానుస్ సీఈఓ షావో హాంగ్ కూడా స్పందించారు. "మెటాతో కలవడం మా పనికి దక్కిన గొప్ప గుర్తింపు. మానుస్ పనితీరులో ఎలాంటి మార్పు లేకుండా, మరింత బలమైన పునాదిపై భవిష్యత్తును నిర్మించుకుంటాం" అని ఆయన తన బ్లాగ్‌లో పేర్కొన్నారు. ఈ డీల్ ప్రకారం, షావో హాంగ్ మెటాలో వైస్ ప్రెసిడెంట్‌గా చేరనున్నారు. 2022లో ప్రారంభమైన మానుస్, కేవలం 8 నెలల్లోనే 100 మిలియన్ డాలర్ల వార్షిక ఆదాయాన్ని సాధించి అందరి దృష్టిని ఆకర్షించింది. కొనుగోలు తర్వాత కూడా మానుస్ సేవలను ప్రత్యేకంగా కొనసాగిస్తామని, అదే సమయంలో తమ ప్లాట్‌ఫామ్‌లలో కూడా ఈ టెక్నాలజీని విలీనం చేస్తామని మెటా స్పష్టం చేసింది. వాట్సాప్ కొనుగోలు తర్వాత మెటా చరిత్రలో ఇది మూడో అతిపెద్ద డీల్‌గా నిలవడం గమనార్హం.

# ఆ ప్రాంతాల్లో గాలిపటం ఎగరేయొద్దు!

సంక్రాంతి పండుగ సీజన్ సంధర్భంగా ప్రజలకు దక్షిణమధ్య రైల్వే విజ్ఞప్తి చేసింది. రైల్వే విద్యుత్ తీగలపై చిక్కి వేలాడుతున్న గాలిపటం దారాలను ఎట్టిపరిస్థితుల్లో తాకకూడదని ప్రజలను హెచ్చరించింది. రైల్వే ప్రాంగణాల పరిసరాల్లో, యార్డులు, ట్రాక్‌లు మరియు సమీపంలోని జనసంచార ప్రాంతాలలో గాలిపటాలు ఎగురవేయడం వల్ల విద్యుదాఘాతానికి గురైన సంఘటనలు ఇదివరకూ అనేకం జరిగాయని తెలిపింది. పతంగీలు ఎగరవేయడంపై జాగ్రత్తలను సూచిస్తూ ప్రకటన విడుదల చేసింది. గత సంక్రాంతి పండుగ సీజన్‌లో విద్యుధాఘాత ఘటనలు రైల్వేలోని అనేక జోన్‌లలో నమోదయ్యాయని తెలిపింది. కొంతమంది వ్యక్తులు 25 కె.వి ట్రాక్షన్ ఓవర్‌హెడ్ కండక్టర్‌లలో చిక్కుకున్న గాలిపటం దారాలను ముట్టుకోవడం ద్వారా విద్యుత్ షాక్‌లు తగిలి తీవ్ర గాయాల పాలయ్యారని పేర్కొంది. ప్రస్తుతం గాలి పతాలు ఎగరవేయడంలో ప్రజలంతా ప్రధానంగా చైనా మాంజా వాడుతున్నారని అది చాలా ప్రమాదకరమని తెలిపింది. ఆదారాలు విద్యుత్ వాహకం ( విద్యుత్‌ను సులభంగా గ్రహించేవి) అవడం వలన మానవ ప్రాణాలకు తీవ్ర నష్టాన్ని చేకూరుస్తున్నాయని రైల్వేశాఖ తెలిపింది. అంతే కాకుండా రైల్వే విద్యుత్ మౌలిక సదుపాయాలకు తీవ్ర ముప్పును కలిగిస్తాయని పేర్కొంది. దీనివలన ప్రయాణీకులతో పాటు రైల్వే సిబ్బందికి, సేవలకు తీవ్ర అంతరాయం ఏర్పడే అవకాశం ఉందని ఇతర ప్రమాదాలకు దారి తీసే అవకాశాలున్నాయని తెలిపింది. కనుక ఈ



విషయంలో ప్రజలు రైల్వేశాఖకు పూర్తి సహకారం అందించాలని రైల్వే ట్రాక్‌లు, స్టేషన్లు, యార్డులు మరియు ఇతర రైల్వే సంస్థాపనల దగ్గర గాలిపటాలు ఎగురవేయకూడదని రైల్వేశాఖ ప్రకటన విడుదల చేసింది. ప్రతి ఒక్కరూ పండుగలను సంతోషంగా బాధ్యతాయుతంగా జరుపుకోవాలని రైలు కార్యకలాపాలను సజావుగా కొనసాగించడంలో సహాయపడాలని కోరింది.

# తమిళనాడు ప్రభుత్వానికి షాక్

తమిళనాడు ప్రభుత్వానికి బిగ్ షాక్ తగిలింది. స్టాలిన్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావించిన మద్రాస్ యూనివర్సిటీ సవరణ బిల్లును రాష్ట్రపతి భవన్ మంగళవారం వెనక్కి పంపించేసింది. మూడేళ్లుగా రాష్ట్రపతి వద్ద ఈ బిల్లు పెండింగ్‌లోనే ఉన్న సంగతి తెలిసిందే. మద్రాస్ యూనివర్సిటీ చట్టం 1923 ప్రకారం.. తమిళనాడు గవర్నర్ యూనివర్సిటీకి ఎక్స్-ఆఫీషియో చాన్సలర్. వైస్ చాన్సలర్ నియామకం, తొలగింపు తదితర హక్కులు గవర్నర్ వద్దే ఉన్నాయి. అయితే.. తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవితో స్టాలిన్ సర్కార్‌కు పొసగడం లేదు. గవర్నర్ వల్లే తమిళనాడులో వర్సిటీల వీసీ నియామకాలు నిలిచిపోయాయని ప్రభుత్వం తరచూ ఆరోపిస్తోంది. ఈ నేపథ్యంలో మద్రాస్ వర్సిటీ బిల్లు ద్వారా గవర్నర్ అధికారాలకు చెక్ పెట్టాలని స్టాలిన్ ప్రభుత్వం ప్రయత్నాలు మొదలుపెట్టింది. రాష్ట్ర ప్రభుత్వం నేరుగా వైస్ చాన్సలర్‌ను నియమించుకునే అధికారం పొందడంతో పాటు ఇతర రాష్ట్రాల్లో ఉన్న విధానాలకు అనుగుణంగా యూనివర్సిటీ పాలనను మార్చడం, అలాగే ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ సెక్రటరీని యూనివర్సిటీ సిండికేట్‌లో సభ్యుడిగా చేర్చడం తదితర అంశాలను బిల్లులో తమిళనాడు ప్రభుత్వం





పొందుపరిచింది. అయితే ఈ బిల్లును గవర్నర్ రాష్ట్రపతి పరిశీలనకు పంపగా.. మూడేళ్ల తర్వాత ఇప్పుడు రాష్ట్రపతి ముర్ము ఈ బిల్లును ఆమోదించకుండానే తిరిగి పంపించారు.

## ఇండోపాక్ సమరాన్ని ఆపా : నెతన్యాహూతో పేర్కొన్న ట్రంప్

**న్యూయార్క్:** ఇండోపాక్ వార్‌ను ఆపినట్లు డోనాల్డ్ ట్రంప్ మళ్లీ పేర్కొన్నారు. ఇజ్రాయిల్ ప్రధాని బెంజిమన్ నెతన్యాహూతో జరిగిన మీటింగ్‌లో ఆయన ఈ అంశాన్ని ప్రస్తావించారు.



ఫ్లోరిడాలోని మార్ ఏ లాగో పామ్‌బీచ్‌లో ట్రంప్‌తో నెతన్యా భేటీ అయ్యారు. రెండోసారి వైట్‌హౌజ్‌లోకి ప్రవేశించిన తర్వాత ఇప్పటి వరకు 8 యుద్ధాలను నివారించినట్లు ట్రంప్ తెలిపారు. ఆర్మేనియా, అజర్‌బైజాన్ మధ్య యుద్ధాన్ని ఆపానని, టారిఫ్‌లతో ఆ రెండు దేశాలను బెదిరించినట్లు చెప్పారు. కానీ తనకు అనుకున్నంత క్రెడిట్ దక్కలేదన్నారు. ఇండియా, పాకిస్థాన్ మధ్య ఫైటింగ్‌ను కూడా ఆపినట్లు ట్రంప్ వెల్లడించారు. అజర్‌బైజాన్ యుద్ధాన్ని ఆపిన తీరు పట్ల పుతిన్ కూడా ఆశ్చర్యాన్ని వ్యక్తం చేసినట్లు ట్రంప్ చెప్పారు. వాణిజ్యాన్ని నిలిపివేస్తానని అజర్‌బైజాన్‌ను బెదిరించామని, 200 శాతం టారిఫ్ విధిస్తామని చెప్పామన్నారు. దీంతో 35 ఏళ్ల ఫైటింగ్‌కు ఆ దేశం ఫుల్‌స్టాప్ పెట్టిందన్నారు. ఆ పని చేసినందుకు నాకేమీ క్రెడిట్ దక్కలేదని, అలాగే 8 యుద్ధాలను ఆపానన్నారు. ఇండియా, పాక్ వార్‌ను కూడా ఆపినట్లు ట్రంప్ చెప్పారు. ఇండోపాక్ సంక్షోభ అంశంపై ఇప్పటి వరకు సుమారు 70 సార్లు ట్రంప్ స్పందించినట్లు తెలుస్తోంది. ఆపరేషన్ సింధూర్ తర్వాత ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేస్తూనే ఉన్నారు.

# మంచంపై పులిరాజా.. ఓ చేదు నిజం!

గ్రామంలోకి చొరబడిన ఓ పెద్దపులి.. జనాలను బెంబేలెత్తించింది. ఓ వ్యక్తిపై దాడి చేశాక.. ఆరుబయట ఉన్న మంచంపై తీరికగా సేద తీరింది. ఆ దృశ్యాన్ని కొందరు ఫోన్లలో బంధించడంతో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. అయితే ఈ ఘటన వెనుక ఉన్న? చేదు నిజం గురించి చర్చ మాత్రం జరగడం లేదన్న అభిప్రాయం సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది. మధ్యప్రదేశ్ బంధవ్‌గఢ్ టైగర్ రిజర్వ్ ప్రాంతంలో గ్రామంలోకి చొరబడింది. అక్కడ ఆరుబయట సంచరిస్తుండగా దానిపై రాళ్లతో దాడి చేశారు. భయంభయంగానే అది దాక్కునే ప్రయత్నం చేసింది. ఈ క్రమంలో అది అక్కడే కట్టేసిన ఉన్న పశువుల జోలికి పోలేదు (గ్రామస్తులు కూడా ఇదే విషయాన్ని చెప్పారు). అయితే రాళ్లు తగిలిన కోపంతో.. ఓ గ్రామస్తుడ్ని నేలకేసి కొట్టింది. ఆపై మరో ఇంట్లోకి వెళ్లి కొన్ని గంటలపాటు మంచంపై కూర్చుని సేదదీరింది. విషయం తెలుసుకున్న అటవీశాఖ సిబ్బంది సుమారు 8 గంటలపాటు శ్రమించి పులిని బంధించారు. పులి బోనులోకి చేరడంతో పాటు గాయపడిన వ్యక్తికి కూడా ప్రాణాపాయం తప్పడంతో.. ఆ ఊరి ప్రజలంతా ఊపిరి పీల్చుకున్నారు. అయితే.. వేటగాళ్లకు భయపడే పులులు గ్రామాల్లోకి వస్తున్నాయని ఆ ఊరి ప్రజలు చెబుతుండడం ఇక్కడ చర్చించాల్సిన విషయం. టైగర్ స్టేట్‌గా పేరొందిన మధ్యప్రదేశ్‌లో పెద్దపులుల మరణాల లెక్కలు ఆందోళనలు రేకెత్తిస్తున్నాయి. తాజాగా.. సగర్ జిల్లాలోని ధానా ఫారెస్ట్ రేంజ్‌లో 10 ఏళ్ల ఆడ పులి మృతదేహం దొరికింది. గత వారం రోజుల్లో రాష్ట్రంలో ఆరు పులులు మృత్యువాత పడగా.. ఈ ఒక్క ఏడాదిలోనే 55 పులులు మరణించడం గమనార్హం. 1973లో మధ్యప్రదేశ్‌లో పులుల సంరక్షణ కోసం ప్రాజెక్ట్ టైగర్ ప్రారంభమైంది. అప్పటి నుంచి పులులు అత్యధికంగా చనిపోయింది ఈ ఏడాదిలోనే. అందునా అసహజ మరణాలే 11 నమోదు అయ్యాయని లెక్కలు చెబుతున్నాయి. అయితే.. అటవీ శాఖ వీటిని ఎక్కువగా పులుల మధ్య గొడవలుగా పేర్కొంటున్నాయి. కానీ, క్షేత్ర పరిస్థితులు అవి కావనే చెబుతున్నాయి. వేట, కరెంట్ ఉచ్చులు.. పర్యవేక్షణ లోపాలు, నిర్లక్ష్యం ప్రధాన కారణాలని తెలుస్తోంది. ఓ జాతీయ మీడియా సంస్థ బయటపెట్టిన అటవీ శాఖ నివేదికలో.. కేసుల దర్యాప్తులో నిర్లక్ష్యం, సరైన ఫోరెన్సిక్ పరిశీలన లేకపోవడం బయటపడ్డాయి. ఇంటర్‌పోల్ రెడ్ కార్నర్ నోటీసు ఉన్న వన్యప్రాణి అక్రమ రవాణా నెట్వర్క్ ప్రధాన సూత్రధారి యాంగ్‌చెన్ లఖుంపా ఇటీవలె సిక్కిం బార్డర్‌లో అరెస్టు అయ్యాడు. మధ్యప్రదేశ్‌లో పులులను చంపి.. వాటి చర్మం, గోళ్లు పళ్లు.. అక్రమ రవాణా చేసిన అభియోగాలు అతనిపై ఉన్నాయి. సంరక్షణవాదులు వ్యవస్థలోనే లోపాలు ఉన్నాయని, సంస్కరణలు లేకపోతే మరణాలు కొనసాగుతాయని హెచ్చరిస్తున్నారు. మధ్యప్రదేశ్ ప్రభుత్వం మాత్రం.. ప్రతి పులి మరణాన్ని సీరియస్‌గా తీసుకుంటామని, నిపుణుల బృందాలు దర్యాప్తు చేస్తున్నాయని ఒక్క మాటతో తేల్చేస్తోంది.

## మందులకు కూడా లొంగని డెడ్లీ ఫంగస్



భారతీయ పరిశోధకుల నేతృత్వంలో జరిగిన ఓ తాజా అధ్యయనం ఆరోగ్య రంగంలో ఆందోళనకర విషయాలను వెల్లడించింది. డ్రగ్ రెసిస్టెంట్ (మందులకు లొంగని) ఫంగల్ జాతి 'కాండిడా ఆరిస్' ప్రపంచవ్యాప్తంగా వేగంగా విస్తరిస్తోందని, ఇది గతంలో కంటే ప్రాణాంతకంగా మారుతోందని హెచ్చరించింది. ఢిల్లీలోని వల్లభ్‌భాయ్ పటేల్ చెస్ట్ ఇన్‌స్టిట్యూట్, అమెరికాకు చెందిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ హెల్త్ (ఎన్‌ఐహెచ్) సంయుక్తంగా ఈ అధ్యయనాన్ని నిర్వహించాయి. ఈ ప్రమాదకరమైన ఫంగల్ ఇన్ఫెక్షన్లు ఏటా ప్రపంచవ్యాప్తంగా దాదాపు 65 లక్షల మందిపై ప్రభావం చూపుతున్నాయని పరిశోధకులు తెలిపారు. దీని తీవ్రత ఎంతలా ఉందంటే.. యాంటీ ఫంగల్ చికిత్స అందించినప్పటికీ మరణాల రేటు 50 శాతానికి పైగా ఉంటోందని పేర్కొన్నారు. ఇది బహుళ ఔషధాలను తట్టుకునే శక్తిని కలిగి ఉండటం వైద్యులను కలవరపెడుతోంది. కాండిడా ఆరిస్ మానవ చర్మంపై ఎక్కువ కాలం జీవించి ఉండగలదని, అక్కడి నుంచి శరీరంలోని ఇతర భాగాలకు వ్యాపిస్తుందని నిపుణులు వివరించారు. ఇది ఈస్ట్ నుంచి ఫిలమెంట్‌గా రూపం మార్చుకోవడం, కణాల సమూహాలను ఏర్పరచుకోవడం వంటి కణ స్థాయి వ్యూహాలతో మనుగడ సాగిస్తోందని 'మైక్రోబయాలజీ అండ్ మాలిక్యులర్ బయాలజీ రివ్యూస్' జర్నల్‌లో ప్రచురితమైన నివేదిక పేర్కొంది. చర్మంపై, అలాగే నిర్జీవ ప్రదేశాలపై కూడా ఇది గమ్ లాగా అతుక్కుపోతుందని తెలిపారు. దీనివల్ల ఆసుపత్రుల్లో చేరిన రోగుల నుంచి ఇతరులకు ఈ ఫంగస్ సులభంగా వ్యాపించే ముప్పు ఉందని హెచ్చరించారు. మరోవైపు, సాధారణ ల్యాబ్ పరీక్షల్లో ఈ ఫంగస్‌ను గుర్తించడం కష్టమని, తరచుగా దీనిని వేరే ఈస్ట్‌గా పొరబడే అవకాశం ఉందని, దీనివల్ల చికిత్స ఆలస్యమవుతోందని పరిశోధకులు వివరించారు. ఈ విపత్తును ఎదుర్కోవడానికి కొత్త రకం యాంటీ ఫంగల్ మందులు, మెరుగైన వ్యాక్సిన్లు, అధునాతన డయాగ్నస్టిక్ పరీక్షలు అందుబాటులోకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని వారు సూచించారు.

## మహిళలకు రక్షణ లేకుండా పోయింది'




పశ్చిమ బెంగాల్‌లోని మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ ప్రభుత్వంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా నిప్పులు చెరిగారు. ప్రభుత్వం అవినీతి, భయం, చొరబాట్లతో బెంగాల్ నిండిపోయిందని.. ఇది రాష్ట్ర భద్రతకు తీవ్ర ముప్పు కలిగిస్తోందని ఆరోపించారు. కోల్‌కతాలో విలేకరుల సమావేశంలో షా మాట్లాడుతూ.. 15 ఏండ్ల తృణమూల్ పాలన వల్ల రాష్ట్రం తీవ్రంగా నష్టపోయిందన్నారు. 'గత 15 ఏండ్లుగా బెంగాల్ భయం, అవినీతి, దుష్పరిపాలనను చూసింది. చొరబాట్లు ప్రజల్లో అభద్రతా భావాన్ని, ఆందోళనను సృష్టించాయి. మహిళలకు రక్షణ లేకుండా పోయింది' అని షా వ్యాఖ్యానించారు. దీదీ నేతృత్వంలోని ప్రభుత్వ అవినీతి కారణంగా రాష్ట్రంలో అభివృద్ధి ఆగిపోయిందన్నారు. వచ్చే ఏడాది ఏప్రిల్‌లో బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయని, ఆ ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత బెంగాల్‌కు తిరిగి పూర్వవైభవం తెస్తామని.. స్వామి వివేకానంద, బంకిం చంద్ర చటోపాధ్యాయ, గురుదేవ్ రవీంద్రనాథ్ ఠాగూర్, శ్యామ ప్రసాద్ ముఖర్జీ ఊహించిన బెంగాల్‌ను నిర్మించడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

## పుతిన్ ఇంటిపైదాడి... మోడీ ఆందోళన

**న్యూఢిల్లీ :** రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ నివాసం లక్ష్యంగా జరిగిన డ్రోన్ దాడుల పట్ల భారత ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ.. ప్రస్తుతం జరుగుతున్న దౌత్యపరమైన చర్చలే యుద్ధాన్ని ముగించి, శాంతిని స్థాపించడానికి సరైన మార్గమని స్పష్టం చేశారు. పుతిన్ నివాసంపై దాడి జరిగిందన్న వార్తలు తనను కలచివేశాయని, ఇలాంటి సమయంలో శాంతి చర్చల ప్రక్రియకు విఘాతం కలిగించేలా ఏ పక్షం కూడా వ్యవహరించకూడదని మోదీ సూచించారు. అందరూ చర్చలపైనే దృష్టి సారించాలని ఆయన కోరారు.రాత్రి వేళ, పుతిన్ ఉంటున్న నొవొగొరోడ్ ప్రాంతంపై ఉక్రెయిన్ 91 లాంగ్ రేంజ్ డ్రోన్లతో విరుచుకుపడిందని రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ ఆరోపించారు. దీనిని ఉగ్రవాద చర్యగా ఆయన అభివర్ణించారు. అయితే రష్యా వైమానిక రక్షణ వ్యవస్థలు వాటన్నింటినీ కూల్చివేశాయని, ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం లేదా ఆస్తి నష్టం జరగలేదని 'టాస్' వార్తా సంస్థ వెల్లడించింది. ఉక్రెయిన్ దాడికి రష్యా తగిన సమాధానం చెబుతుందని లావ్రోవ్ హెచ్చరించారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఆయన ఆదివారం పుతిన్‌తో ఫోన్‌లో మాట్లాడగా, ఫ్లోరిడాలోని తన నివాసంలో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో భేటీ అయ్యారు. ఈ చర్చలు చాలా సానుకూలంగా సాగాయని, యుద్ధం ముగింపు దశకు చాలా దగ్గరగా ఉందని ట్రంప్ వెల్లడించారు. ఇలాంటి కీలక సమయంలో దాడులు జరగడం అంతర్జాతీయంగా ఆందోళన రేకెత్తిస్తోంది.

## ప్రియాంక గాంధీ ఇంట మోగనున్న పెళ్లి బాజాలు.. స్నేహితురాలితో కుమారుడి ఎంగేజ్మెంట్

కాంగ్రెస్ అగ్ర నాయకురాలు, వయనాడ్ ఎంపీ ప్రియాంక గాంధీ ఇంట త్వరలో పెళ్లి బాజాలు మోగనున్నాయి. ప్రియాంక, ప్రముఖ వ్యాపారవేత్త రాబర్ట్ వాద్రా కుమారుడు రేహాన్ వాద్రా త్వరలో వివాహ బంధంలోకి అడుగుపెట్టనున్నారు. తన స్నేహితురాలు అవీవా బేగ్ తో రేహాన్ ఎంగేజ్మెంట్



జరిగినట్లు సంబంధిత వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియాలో వరుస కథనాలు వస్తున్నాయి. 25 ఏళ్ల రైహాన్ వాద్రాకు అవీవాతో ఏడేళ్లుగా పరిచయం ఉంది. వీరిద్దరూ మంచి స్నేహితులు. ఆ స్నేహం కాస్తా ప్రేమకు దారి తీసింది. ఈ క్రమంలో అవివా బేగ్‌కు రేహాన్ ప్రపోజ్ చేయగా.. ఆమె ఓకే చెప్పినట్లు సదరు వర్గాలు తెలిపాయి. ఈ క్రమంలో ఇరు కుటుంబాల అంగీకారంతో వీరిద్దరూ త్వరలో వివాహబంధంలోకి అడుగుపెట్టబోతున్నట్లు తెలుస్తోంది. వీరి ఎంగేజ్మెంట్ కూడా జరిపించినట్లు టాక్. అయితే, దీనిపై ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటనా రాలేదు. అవీవా ఢిల్లీకి చెందిన అమ్మాయిగా తెలుస్తోంది.

## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఎండగట్టాలి

-మొదటిపేజీ తరువాయి

రంగారెడ్డి ప్రాజెక్ట్ విషయంలో గత పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఏం చేసిందని, ఈ ప్రాజెక్ట్‌ను పక్కన పెట్టి కేవలం కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను మాత్రమే నిర్మించిందని అధికార కాంగ్రెస్ పార్టీ ఆరోపణ. బీఆర్ఎస్ పార్టీ పదేళ్ల కాలంలో అటు కృష్ణా, ఇటు గోదావరి రెండు నదులపై చేపట్టిన ప్రాజెక్టులు, నీటి వాటాలు పరిష్కరించామని ఆ పార్టీ చెప్పుకొస్తోంది. ఇదే విషయంపై కొద్దిరోజులుగా సీఎం రేవంత్ రెడ్డి, మాజీ సీఎం మధ్య మాటల యుద్ధం వ్యక్తిగత దూషణలకు దారి తీసింది. వీటన్నింటికీ అసెంబ్లీ వేదికగా సమాధానం చెప్పాలని బీఆర్ఎస్ పార్టీ గట్టి పట్టుదలతో ఉంది. ఇందులో భాగంగానే కాసేపటి క్రితమే కేసీఆర్‌తో కేటీఆర్, హరీష్ రావు, ఇతర నాయకులు సమావేశమయ్యారు. ప్రభుత్వం ఎలా స్పందిస్తుంది?.. ప్రభుత్వం చెప్పే ప్రతీ అంశంపై సమాధానంతో సిద్ధంగా ఉండాలని ఇప్పటికే పార్టీ నేతలకు కేసీఆర్ చెప్పినట్లు తెలుస్తోంది.

## స్త్రీ నిధి పేరుతో యాప్

**హైదరాబాద్ :** తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ప్రజలకు మరింత వేగంగా, సులభతరంగా సేవలు అందించేందుకు టెక్నాలజీని సమర్థవంతంగా ఉపయోగించుకుంటోంది. ప్రజలు తమ మొబైల్ నుంచే అన్నీ సేవలు పొందేలా డిజిటల్ సేవలను అందుబాటులోకి తీసుకొస్తుంది. ఇటీవల మీ సేవకు వెళ్లాల్సిన అసవరం లేకుండా మీ సేవ యాప్‌ను తీసుకురాగా.. దీని ద్వారానే ప్రజలు ఇన్ కమ్, కులం, రెసిడెన్షియల్ సర్టిఫికేట్ లాంటివి పొందవచ్చు. ఇక రేషన్ కార్డు వివరాలు, డీలర్ వద్ద ఎంత స్టాక్ ఉందనేది తెలుసుకునేందుకు ఇటీవల టీ రేషన్ యాప్ ప్రారంభించింది. అలాగే రైతుల కోసం కొద్దిరోజుల క్రితం యూరియా బుక్ చేసుకునేందుకు యాప్ లాంచ్ చేయగా.. తాజాగా మహిళలకు ఉపయోగపడేలా కొత్త యాప్ తెచ్చింది. మహిళా పొదుపు సంఘాలకు ఆర్థికంగా తోడ్పాటు అందించేందుకు ప్రభుత్వం స్త్రీ నిధి పేరుతో రుణాలు మంజూరు చేస్తోన్న విషయం తెలిసిదే. ఈ రుణాలను సులువుగా పొందేలా మన స్త్రీనిధి పేరుతో యాప్ తీసుకొచ్చింది.

# గులాబీకి కలిసి రాని కాలం

**హైదరాబాద్ :** తెలంగాణ రాజకీయాల్లో కేసీఆర్, బీఆర్ఎస్ పేర్లు చెబితే పార్టీ క్యాడర్‌లో ఒక జోష్, ఉత్సాహం కనిపిస్తుంది. తెలంగాణ అభిమానుల్లో ఒక ఆవేశం తొణికిసలాడుతుంది. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాడిన తర్వాత రెండుసార్లు ముఖ్యమంత్రి అయిన కేసీఆర్.. తిరుగులేని నాయకుడిగా గురి?తంపు తెచ్చుకున్నారు. అయితే 2023 ఎన్నికలనాటికి కేసీఆర్, అతని కుటుంబం అనుసరించిన విధానాలతో ప్రజల్లో వ్యతిరేకత పెరిగింది. దీంతో మూడోసారి గెలవాలన్న కేసీఆర్ ఆకాంక్ష నెలరవేరలేదు. దశాబ్దకాలం తిరుగులేని నేతగా ఉన్న కేసీఆర్ గ్రాఫ్ 2023 డిసెంబర్ తర్వాత నుంచి పడిపోతూ వస్తోంది. 2025లో అయితే ఇటు పార్టీ, అటు కుటుంబం, మరోవైపు అనారోగ్య సమస్యలు కేసీఆర్‌ను చుట్టుముట్టాయి. దీంతో దాదాపు ఏడాదికాలం ఆయన ప్రజలో?లకి రాలేదు. ప్రతిపక్ష నేతగా ఆశించిన ప్రభావం చూపలేదు. పార్టీలో కలహాలు, ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపు, సొంత పార్టీపైనే కూతురు ఆరోపణలు.. కేసీఆర్‌పై మరింత ఒత్తిడి పెంచాయి2025 కేసీఆర్‌కు పరీక్షల సంవత్సరంగా మారింది. పార్టీ టికెట్‌పై గెలిచిన 10 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరారు. వీరిని అనర్హులుగా ప్రకటించాలని కేసీఆర్ పట్టుదలగా పోరాడుతున్నారు. సుప్రీం కోర్టు వరకు కూడా వెళ్లారు. అయితే కేసుల్లో వేగం లేదని రాజకీయ వర్గాల్లో చర్చ. ఇక కేసీఆర్ కూతురు, ఎమ్మెల్యే కల్వకుంట్ల కవిత బీఆర్ఎస్‌పై తిరుగుబాటు చేశారు. సొంత నేతలపైనే ఆరోపణలు చేశారు. దీంతో చివరకు కూతురును కూడా పార్టీ నుంచి సస్పెండ్ చేయాల్సిన పరిస్థితి కేసీఆర్‌కు వచ్చింది. అయితే కవిత పార్టీని వదిలి, తండ్రి పాలనపై దర్యాప్తు చేస్తానని షాక్ ఇచ్చారు. ఆమె లక్ష్యం వేరైనా, దెబ్బ తగిలేది కేసీఆర్‌కేబీఆర్ఎస్ కార్యకర్తల్లో కేసీఆర్ ఆరోగ్యం గురించి ఆందోళనా గుసగుసలు ఎక్కువ. ఏడాదంతా ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లోనే పరిమితం కావడం అనుమానాలకు తావిచ్చింది. అవసర సమయంలో వైద్య పరీక్షలకు వస్తున్నారు. అక్కడి నుంచే పార్టీ ఆదేశాలు జారుతున్నాయి. కేటీఆర్‌కు బాధ్యతలు అప్పగించినా, మేడిగడ్డ బ్యారేజ్, కాళేశ్వరం ప్రాజెక్టుల్లో విచారణలు, ఫార్ములా-ఈ రేస్




ఆరోపణలు కుటుంబాన్ని చుట్టుముట్టాయి. ఈ ఒత్తిడులు ఆయన ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నాయని పార్టీలో అభిప్రాయం. 2025-26 బడ్జెట్ సమావేశాల్లో కేసీఆర్ తొలిరోజు మాత్రమే కనిపించారు. కొద్ది నిమిషాల పాటే. తర్వాత అసెంబ్లీలో ముఖం చూపలేదు. తాజాగా శీతాకాల సమావేశాల తొలిరోజు మళ్లీ హాజరయ్యారు. సీఎం రేవంత్‌రెడ్డి వచ్చి నమస్కారం చేసిన ఆ సన్నివేశం సోషల్ మీడియాలో వైరల్ అయింది. కేవలం ఐదు నిమిషాలే అసెంబ్లీ హాల్‌లో ఉండి వెళ్లిపోయారు. హాజరు పడేందుకే కేసీఆర్ అసెంబ్లీకి వస్తున్నట్లు కనిపిస్తోంది.కేసీఆర్ పార్టీకే కాదు ప్రజలకూ దూరంగా ఉంటున్నారు. జల వివాదాల మధ్య నల్లగొండలో ఈ ఏడాది ఫిబ్రవరిలో ఓ భారీ పబ్లిక్ మీటింగ్ నిర్వహించారు. ఆ తర్వాత ప్రజల ముందు కనిపించలేదు. రెండేళ్ల తర్వాత ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో తన స్టైల్‌లో విమర్శలు గుప్పించారు. కానీ తర్వాత మళ్లీ సైలెంట్ అయ్యారు. దీంతో ప్రజల్లోనూ, పార్టీలోనూ కేసీఆర్ గ్రాఫ్ పడిపోతోంది. 2025 సంవత్సరం బీఆర్ఎస్ రెండు కీలక ఎన్నికలు ఎదుర్కొంది. జూబ్లీహిల్స్ బై-పోల్‌లో మాగుంట గోపీనాథ్ మరణంతో వచ్చిన ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ నిలబెట్టుకోలేదు. ఇక పంచాయతీ ఎన్నికల్లో మాత్రం మెరుగైన ప్రదర్శన కనబర్చింది. మొత్తంగా 2025 కేసీఆర్‌కు పరాజయాలే ఎక్కువగా ఎదురయ్యాయి.

# ‘భారత్ సంస్కరణల ఎక్స్‌ప్రెస్ ఎక్కింది’

తదుపరి తరం సంస్కరణలతో భారత్ పురోగతిని వేగవంతం చేసిన తీరును ప్రపంచం అభినందిస్తోందని ప్రధాని మోదీ తెలిపారు. ఈ సంస్కరణలు వివిధ రంగాలకు చెందినవని, దేశ వృద్ధి సామర్థ్యాన్ని విస్తృతం చేస్తాయని అన్నారు. భారత్ తన ఆవిష్కరణల కారణంగా ప్రపంచం దృష్టిని ఆకర్షించిందని పేర్కొన్నారు. ప్రస్తుతం భారత్?ను ప్రపంచం ఆశతో, విశ్వాసంతో చూస్తోందని పేర్కొన్నారు. ఈ మేరకు లింక్డిన్‌లో పోస్ట్ చేశారు. భారత్ సంస్కరణల ఎక్స్‌ప్రెస్‌ను ఎక్కిందని మోదీ తెలిపారు. ఈ సంస్కరణల ఎక్స్‌ప్రెస్ ప్రాథమిక ఇంజిన్ దేశ జనాభా, యువత, ప్రజల అజేయ స్ఫూర్తి అని తాను చాలా మందికి చెబుతున్నానన్నారు. గత 11 ఏళ్లుగా నిరంతర జాతీయ లక్ష్యంతో సంస్కరణలపై దృష్టి సారించిన సంవత్సరంగా 2025 భారత్?కు గుర్తుండిపోతుందని చెప్పారు. తాము సంస్థలను ఆధునీకరించామని, పాలనను సరళీకృతం చేశామని గుర్తు చేసుకున్నారు. దీర్ఘకాలిక, సమ్మిళిత వృద్ధికి పునాదులను బలోపేతం చేశామని పేర్కొన్నారు.

జీఎస్టీ సంస్కరణలతో కోట్లాది కుటుంబాలకు ఉపశమం :
సంస్కరణలు పౌరులు గౌరవంగా జీవించడానికి, వ్యవస్థాపకులు నమ్మకంగా కొత్త ఆవిష్కరణలు చేయడానికి, సంస్థలు స్పష్టత, నమ్మకంతో పనిచేయడానికి వీలు కల్పిస్తున్నాయని మోదీ తెలిపారు. ఈ క్రమంలో వస్తు సేవల పన్ను(జీఎస్టీ), భారతీయ బీమా కంపెనీలలో 100 శాతం ఎఫ్?డీఐ అనుమతి, కార్మిక చట్టాలు, వీబీ జీ రామ్ జీ వంటి కొన్ని సంస్కరణలను ఉదహరించారు. ప్రస్తుతం 5శాతం, 18శాతం జీఎస్టీ శ్లాబ్ లను అమలు చేస్తున్నామన్నారు. దీంతో కోట్లాది కుటుంబాలపై భారం తగ్గడమే కాకుండా, గిరాకీ పెరిగిందని అన్నారు. జీఎస్టీ సంస్కరణల వల్ల పండుగ సీజన్?లో అమ్మకాలు పెరిగాయన్నారు.

“ఆదాయ పన్ను మినహాయింపు పరిమితిని రూ. 12లక్షలకు పెంచుతూ తీసుకున్న నిర్ణయం వేతన జీవులకు ఊరట కల్పించింది. 1961 నాటి ఆదాయపు పన్ను చట్టం స్థానంలో ఆధునిక, సరళమైన ఐటీ చట్టం 2025ను తీసుకొచ్చాం. చిన్న, మధ్య తరహా వ్యాపారాలను ప్రోత్సహిస్తున్నాం. భారతీయ బీమా కంపెనీలలో ప్రభుత్వం 100 శాతం ఎఫ్?డీఐని అనుమతించింది. ఇది బీమా వ్యాప్తికి, ప్రజల భద్రతకు ఊతం ఇస్తుంది.”
– నరేంద్ర మోదీ, భారత ప్రధాని

ఒకే పార్లమెంట్ సమావేశంలో (వర్షాకాల సమావేశంలో) ఐదు మైలురాయి సముద్ర చట్టాలను ఆమోదించినట్లు ప్రధాని మోదీ చెప్పారు. “బిల్స్ ఆఫ్ లాడింగ్ చట్టం- 2025, సముద్రమార్గం ద్వారా వస్తువుల రవాణా బిల్లు- 2025, కోస్టల్ షిప్పింగ్ బిల్లు- 2025, మర్చంట్ షిప్పింగ్ బిల్లు- 2025, ఇండియన్ పోర్ట్స్ బిల్లు- 2025 ను వర్షాకాల సమావేశాల్లో ఆమోదించాం. ఈ సంస్కరణలు డాక్యుమెంటేషన్?ను సులభతరం చేస్తాయి. వివాద పరిష్కారాన్ని సులభతరం చేస్తాయి. లాజిస్టిక్స్ ఖర్చులను తగ్గిస్తాయి. వందల ఏళ్ల క్రితం నాటి పాత చట్టాలను కూడా భర్తీ చేశాయి. 29 కార్మిక చట్టాలను నాలుగుకు కుదించాం. వాటి స్థానంలో నాలుగు ఆధునిక లేబర్ కోడ్ లను తెచ్చాం. తద్వారా చారిత్రక కార్మిక సంస్కరణలు ప్రారంభించాం. ఈ సంస్కరణలు న్యాయమైన వేతనాలు, జీతాలను సకాలంలో చెల్లించడం, ఉద్యోగుల సామాజిక భద్రత, సురక్షితమైన కార్యాలయాలపై దృష్టి సారించాయి. ఇవి శ్రామిక శక్తిలో ఎక్కువ మహిళా భాగస్వామ్యాన్ని నిర్ధరిస్తాయి. కాంట్రాక్ట్ కార్మికులు సహా అసంఘటిత కార్మికులను ఈఎస్ఐసీ, ఈపీఎఫ్ఓ ??పరిధిలోకి తీసుకొచ్చాం” అని మోదీ పేర్కొన్నారు. మరోవైపు, న్యూజిలాండ్, ఒమన్, బ్రిటన్?లతో కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల గురించి కూడా మోదీ ప్రస్తావించారు. ఈ ఒప్పందాలు పెట్టుబడులకు తోడ్పడతాయని అన్నారు. ఉద్యోగ సృష్టిని పెంచుతాయని, స్థానిక వ్యవస్థాపకులను ప్రోత్సహిస్తాయని వెల్లడించారు.

**‘వివిధ రంగాల్లో మిషన్ మోడ్?లో సంస్కరణలు’**

దీర్ఘకాలిక వృద్ధిని కొనసాగించడానికి వివిధ రంగాలలో మిషన్ మోడ్ సంస్కరణలు చేపట్టాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. భారత్ ప్రపంచ స్థాయి సామర్థ్యాలను పెంపొందించుకోవాలని, ప్రపంచంతో ఏకీకరణ సాధించాలని అన్నారు. భారత్ విధాన రూపకల్పన, బడ్జెట్ కేటాయింపులు 2047 వికసిత్ భారత్?కు అనుగుణంగా ఉండాలని అభిప్రాయపడ్డారు. దేశం ప్రపంచ శ్రామికశక్తికి, అంతర్జాతీయ మార్కెట్లకు ఒక కీలక కేంద్రంగా ఉండేలా చూడాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. వికసిత భారత్?ను ఒక జాతీయ ఆకాంక్షగా అభివర్ణించారు. నీతి ఆయోగ్?లో ప్రముఖ ఆర్థికవేత్తలు, నిపుణుల బృందంతో ప్రధాని మోదీ సంభాషించారు. ఈ క్రమంలో ఈ వ్యాఖ్యలు చేశారు.

## ట్రాఫిక్ కష్టాలు ఉండకూడదు

-మొదటిపేజీ తరువాయి

అన్ని రకాల చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు. పోయినసారి ఎదురైనా అనుభవాల దృష్ట్యా ముందస్తు చర్యలు తీసుకోవాలి. రోజుకు సుమారు లక్ష వాహనాల ప్రయాణం సాగుతుంది. కాబట్టి దీనిపై అన్ని విభాగాల అధికారులు అప్రమత్తంగా ఉండాలి. పండుగ రద్దీ ఉన్న రోజుల్లో లేన్‌లు మూసే పనులు, భారీ యంత్రాలతో చేసే పనులు చేయొద్దు. అత్యవసరంగా చేయాల్సిన పనులు ట్రాఫిక్ తక్కువగా ఉండే రాత్రి వేళల్లో మాత్రమే చేయాలి. పండుగ మొదలుకానున్న తేదీకి ముందే రోడ్లపై ఉన్న మట్టి, నిర్మాణ సామగ్రి, యంత్రాలు పూర్తిగా తొలగించాలి. అన్ని రహదారి లేన్‌లు వాహనాల రాకపోకలకు పూర్తిగా అందుబాటులో ఉంచాలి. పగలు, రాత్రి రోడ్డు పనులు జరుగుతున్న ప్రతి చోట స్పష్టంగా కనిపించే ట్రాఫిక్ బోర్డులు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి. హై-విజిబిలిటీ కోన్లు, బారికేడ్లు ఏర్పాటు చేసి పనులు జరిగే ప్రాంతం, ట్రాఫిక్ వెళ్లే దారి స్పష్టంగా చూపాలి. ఎక్కడా ట్రాఫిక్‌కు అయోమయం కలిగించే ఏర్పాట్లు ఉండకూడదు. రద్దీ ఎక్కువగా ఉండే జంక్షన్లు, టోల్ ప్లాజాలు, కీలక ప్రాంతాల్లో అదనపు ట్రాఫిక్ పోలీసులను మోహరించాలి. ట్రాఫిక్ మళ్లింపులు, నియంత్రణ అంశాల్లో స్థానిక ట్రాఫిక్ పోలీసులతో నిరంతరం సమన్వయం పాటించాలి. అన్ని సంబంధిత శాఖలు పోలీసుల సూచనలను తప్పనిసరిగా అమలు చేయాలి. రోడ్డు పనుల్లో ఉన్న సిబ్బంది అందరూ ప్రతిబింబించే జాకెట్లు (పసుపు / నారింజ రంగు) తప్పనిసరిగా ధరించాలి.
రాత్రి సమయంలో జంక్షన్లు, వర్క్ జోన్‌ల వద్ద తగినంత వెలుతురు ఏర్పాటు చేయాలి. బారికేడ్లు, ట్రాఫిక్ ఐలాండ్‌లపై రిఫ్లెక్టివ్ స్టిక్కర్లు తప్పనిసరిగా ఉపయోగించాలి. రూట్ పేట్రోల్ వాహనాలు, క్రేన్లు, అంబులెన్సులు 24 గంటలు అందుబాటులో ఉంచాలి. అన్ని రహదారి ఘటనలను ప్రత్యేక ఇన్సిడెంట్ మేనేజ్‌మెంట్ కంట్రోల్ రూమ్ నుంచి నిరంతరం పర్యవేక్షించాలి. టోల్ ప్లాజాల వద్ద వాహనాలు ఆగకుండా సజావుగా వెళ్లేలా అదనపు బృందాలను మోహరించాలి. రేపు నేను తూప్రాన్ పేట్,అబ్దుల్లాపూర్ మెట్ ప్రాంతాల్లో ఫీల్డ్ విజిట్ చేస్తా అని తెలిపారాయన.

**కేంద్రానికి ఫ్రీ వే రిక్వెస్ట్**

సంక్రాంతి పండుగ వేళ ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా టోల్ ప్లాజాల వద్ద ఫ్రీ వే ఏర్పాటుకు కేంద్రానికి రిక్వెస్ట్ చేస్తామని మంత్రి కోమటిరెడ్డి అన్నారు. “పండుగ పూట లక్షలాది మంది ప్రయాణం చేస్తారు.. వారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలనేది మా ప్రభుత్వ ఆలోచన. ఈ అంశంపై కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి ఇవాళ లేఖ రాస్తా. అవసరమైతే ఒకటి,రెండు రోజుల్లో నేను స్వయంగా వెళ్ళి కలుస్తా. జనవరిలో ప్రపంచంలోనే అతిపెద్ద గిరిజన జాతరైన మేడారం జాతరకు వెళ్లే లక్షలాది భక్తులకు అసౌకర్యం లేకుండా చూడాలని కోరతా. టోల్ ప్లాజాల వద్ద ఫ్రీగా ఉంటే వాహనాలు ఆగవు..ఎలాంటి అసౌకర్యం ఉండదు” అని తెలిపారాయన. ఈ సమీక్ష సమావేశంలో స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్,యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు,నల్గొండ కలెక్టర్ ఇలా త్రిపాఠి,సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్,%చీనాా×% రీజినల్ అధికారి శివ శంకర్, %వీశీ=ుం% రీజినల్ అధికారి కృష్ణ ప్రసాద్,డీసీపీ జగదీశ్వర్ రెడ్డి, ఇంటెలిజెన్స్ ఎస్పీ,పలువురు పోలీస్ ఉన్నతాధికారులు,ఆర్ అండ్ బీ ఈఎన్సిలు జయభారతి, మోహన్ నాయక్, ఎస్.ఈ ధర్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రణాళికాబద్ధంగా రాష్ట్రాభివృద్ధి

-మొదటిపేజీ తరువాయి

చెప్పుకొచ్చారు. పరిపాలనను పట్టాలెక్కించాలనేదే తమ ఆలోచన అని తెలిపారు. హైదరాబాద్ నగరంలో అత్యంత సంక్లిష్టమైన సమస్య చెత్త నిర్వహణ అని వివరించారు. కోర్ అర్బన్ రీజియన్‌ను ప్రక్షాళన చేయాలని తమ ప్రభుత్వం నిర్ణయించిందని పేర్కొన్నారు. జోన్‌ల వారీగా సంబంధిత సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత జోనల్ కమిషనర్‌లదేనని స్పష్టం చేశారు. సిటీలో ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలని నిర్ణయించామని పేర్కొన్నారు. చెరువులు, నాలాలను ఆక్రమణల నుంచి కాపాడుకోవాలని మార్గనిర్దేశం చేశారు. క్యూర్ పరిధిలో డీజిల్ బస్సులు, ఆటోల స్థానంలో ఈవీ వాహనాలను తీసుకురావాలని నిర్ణయించామని తెలిపారు. సిటీలో కాలుష్య నియంత్రణకు అవసరమైన పూర్తిస్థాయి ప్రక్షాళన తీసుకుంటున్నామని వెల్లడించారు సీఎం రేవంత్‌రెడ్డి.
చెరువులు, నాలాలు, చెత్త డంపింగ్ ఏరియాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నెలకు మూడు రోజులు శానిటేషన్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని దిశానిర్దేశం చేశారు. రోడ్లపై ఎక్కడా చెత్త కనిపించడానికి వీల్లేదని హుకుం జారీ చేశారు. అలాగే, రోడ్లపై గుంతలు కనిపించొద్దని సూచించారు. జనన, మరణ ధ్రువీకరణ, ట్రేడ్ లైసెన్సులు, ఇతర ధ్రువపత్రాల జారీకి టెక్నాలజీని ఉపయోగించుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ టెక్నాలజీని ఉపయోగించి ప్రజలకు పారదర్శక సేవలు అందించాలని మార్గనిర్దేశం చేశారు. కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్, అపార్ట్‌మెంట్ అసోసియేషన్‌లతో కమ్యూనికేషన్ ఉండేలా చూసుకోవాలని సూచించారు సీఎం రేవంత్‌రెడ్డి. గుడ్ గవర్నెన్స్ నుంచి స్మార్ట్ గవర్నెన్స్‌కు మారాలని దిశానిర్దేశం చేశారు. హైడ్రా, జీహెచ్ఎంసీ, వాటర్‌వర్క్స్ విభాగాలు నాలాల పూడిక తీత పనులు జనవరి నుంచి ప్రారంభించాలని నిర్దేశించారు. నగరంలో వీధి దీపాలు సరిపడా ఉండేలా చూసుకోవాలని సూచించారు. క్యూర్ ఏరియాలో ఆయా విభాగాల అధికారులను సమన్వయం చేసే బాధ్యత స్పెషల్ సీఎస్ చూసుకుంటారని పేర్కొన్నారు. దోమల నివారణ, అంటువ్యాధులు ప్రబలకుండా జోనల్ కమిషనర్ ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రతీ పది రోజులకోసారి గార్బేజ్ క్లియరెన్స్ డ్రైవ్ నిర్వహించాలని సూచించారు. ఎక్కడ సమస్య తలెత్తినా పరిష్కరించేందుకు టోల్ ఫ్రీ నంబర్‌కు వీలైనంత స్పీడ్‌గా రెస్పాన్స్ అవ్వాలని మార్గనిర్దేశం చేశారు. ఈ నేపథ్యంలో వచ్చే ఐదేళ్లకు యాక్షన్ ప్లాన్ రూపొందించుకోవాలని సూచించారు. అధికారులు అందరూ కలిసి పనిచేస్తేనే నగరం భవిష్యత్ బాగుంటుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

## జర్నలిస్టులు ఎలాంటి అపోహలు పడొద్దు

హైదరాబాద్

అక్రిడిటేషన్‌ల విషయంలో ప్రభుత్వం విడు దల చేసిన జీవో 252తో తమకు అన్యాయం జరుగుతుందని డెస్క్ జర్నలిస్టులు గడిచిన వారం రోజులుగా ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఈ క్రమంలో డెస్క్ జర్నలిస్టులకు అన్యాయం జరగకుండా చూడాలని కోరుతూ.. టీడబ్ల్యూజేఎఫ్, డీజేఎఫ్టీ నేతలు మంగళవారం సమాచార, ప్రసార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిశారు. డెస్క్ జర్నలిస్టులకు గతంలో లాగే అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలని, జీవో 252 ని సవరించాలని మంత్రి పొంగులేటి దృష్టికి తీసుకెళ్లారు. స్పోర్ట్స్, కల్చరల్, ఫీచర్ ప్రతినిధులకు అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలని ఫెడరేషన్ నేతలు విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టు సంఘాల వినతిపై మంత్రి పొంగులేటి కూడా సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. రిపోర్టర్లతోపాటు డెస్క్ జర్నలిస్టులకు అన్ని సౌకర్యాలు ఉంటాయని, డెస్క్ జర్నలిస్టులు ఎలాంటి అపోహలు పడొద్దని ఆయన చెప్పినట్లు తెలిసింది. త్వరలోనే జర్నలిస్టు సంఘాలతో సమావేశం ఏర్పాటు చేసి, వారి అపోహలను తొలగించే ప్రయత్నం చేస్తానని కూడా చెప్పినట్లు సమాచారం. జర్నలిస్టులకు ఇబ్బంది లేకుండా జీవో 252ను సవరిస్తామని మంత్రి చెప్పనట్లు తెలుస్తోంది.

## బనకచర్ల ప్రాజెక్టుకు వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం చేయాలి



-మొదటిపేజీ తరువాయి


బనకచర్ల ప్రాజెక్టును నిర్మిస్తే తెలంగాణ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరుగుతోందని చెప్పుకొచ్చారు. ఇంత జరుగుతుంటే కాంగ్రెస్ ప్రభుత్వం మొద్దు నిద్ర పోతుందని ఆక్షేపించారు హరీశ్‌రావు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అసెంబ్లీలో ప్రతిసారి బీఆర్ఎస్ నాయకులను విమర్శించడమే సరిపోతోందని విమర్శించారు. నీటి వాటా విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిద్ర పోతుందా.. నిద్ర పోతున్నట్లు నటిస్తుందా అర్థం కావడం లేదని ఎద్దేవా చేశారు. తాను ఎటువంటి ఫేక్ రాజకీయాలు చేయడం లేదని స్పష్టం చేశారు. తెలంగాణతో ఉన్న అనుబంధంతోనే తాను ఇలా మాట్లాడుతున్నానని చెప్పుకొచ్చారు హరీశ్‌రావు. తెలంగాణ జలదోపిడికి సూత్రదారి ఆదిత్య నాథ్ దాస్ అని ఆరోపణలు చేశారు. తెలంగాణ ద్రోహి ఆయనేనని ఆక్షేపించారు. ఆదిత్య నాథ్ దాస్‌ను రేవంత్‌రెడ్డి సర్కార్ వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. బనకచర్ల ప్రాజెక్టుకు సీడబ్ల్యూసీ అనుమతి ఇచ్చేందుకు కేంద్ర బీజేపీ ప్రభుత్వానికి ఎంత ధైర్యమని నిలదీశారు. బనకచర్ల ప్రాజెక్టుకు వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీలో తీర్మానం చేస్తే తాము సంపూర్ణ మద్దతు ఇస్తామని స్పష్టం చేశారు. గోదావరి బనకచర్ల ప్రాజెక్టుపై సీడబ్ల్యూసీ అనుమతి రద్దు చేయాలని ఢిల్లీలో ధర్నా చేద్దామని హరీశ్‌రావు సూచించారు.

## ఇక టోల్ ఫ్రీ ప్రయాణం

**నల్గొండ :** తెలుగు రాష్ట్రాల మధ్య అత్యంత రద్దీగా ఉండే హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారిపై సంక్రాంతి ప్రయాణాలను సులభతరం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం ఒక సాహసోపేతమైన నిర్ణయం తీసుకోబోతోంది. పండుగ రోజుల్లో టోల్‌గేట్ల వద్ద వాహనాలు గంటల తరబడి నిలిచిపోకుండా ఉండేందుకు.. ఆ మూడు నాలుగు రోజుల పాటు టోల్ వసూళ్లను పూర్తిగా నిలిపివేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ మేరకు జాతీయ రహదారుల ప్రాధికార సంస్థకు, కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి లేఖ రాయాలని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నిర్ణయించారు. దీనిపై చర్చించేందుకు మంగళవారం సచివాలయంలో ఉన్నత స్థాయి సమావేశం జరగనుంది.ప్రతి ఏటా సంక్రాంతి పండుగ వచ్చిందంటే చాలు.. భాగ్యనగరం నుండి ఆంధ్రప్రదేశ్ వైపు వెళ్లే ప్రయాణికులకు టోల్ కష్టాలు తప్పవు. ముఖ్యంగా పంతంగి, కొర్లపహాడ్ చిల్లకల్లు వంటి టోల్ ప్లాజాల వద్ద వాహనాలు కిలోమీటర్ల మేర బారులు తీరుతుంటాయి. ఫాస్టాగ్ సౌకర్యం ఉన్నప్పటికీ.. వాహనాల సంఖ్య లక్షల్లో ఉండటంతో ఒక్కో టోల్ ప్లాజా దాటడానికి గంటల సమయం పడుతోంది. పండుగకు వెళ్లే ఉత్సాహంలో ఉన్న సామాన్యులకు ఈ ట్రాఫిక్ జామ్‌లు నరకాన్ని చూపిస్తున్నాయి. చంటిపిల్లలు, వృద్ధులతో ప్రయాణించే వారు ఈ రద్దీలో చిక్కుకుని తీవ్ర ఇబ్బందులు పడుతున్న దృశ్యాలు ఏటా కనిపిస్తూనే ఉన్నాయి.ప్రస్తుతం ఈ జాతీయ రహదారిపై పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంది. వివిధ చోట్ల ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు, వంతెనలు, సర్వీసు రోడ్ల పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. నిర్మాణ పనుల కారణంగా రహదారిపై ఇప్పటికే అనేక చోట్ల మళ్లింపులు ఉన్నాయి. సాధారణ రోజుల్లోనే వాహనాలు నెమ్మదిగా సాగుతుండగా.. ఇక పండుగ రద్దీ తోడైతే ట్రాఫిక్ సమస్య మరింత జటిలమయ్యే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. టోల్ వసూళ్ల కోసం వాహనాలను ఆపితే.. ఆ రద్దీ వెనక్కి కిలోమీటర్ల మేర విస్తరించి హైవే అంతా స్తంభించిపోయే ప్రమాదం ఉంది.

# బోగస్ ఓట్ల తొలగింపునకు యూత్ కాంగ్రెస్ వినతి

**సామాన్యుడి అస్త్రం హుజురాబాద్ :** తహసిల్దార్, మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం జమ్మికుంట మున్సిపాలిటీలో బోగస్ (దొంగ) ఓట్లను వెంటనే తొలగించాలని కోరుతూ యూత్ కాంగ్రెస్ జమ్మికుంట మండల ఆధ్వర్యంలో మంగళవారం తహసిల్దార్ వెంకట్ రెడ్డి గారికి, మున్సిపల్ కమిషనర్ ఆయాజ్ గారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ జమ్మికుంట మండల అధ్యక్షులు బడిగె శ్రీకాంత్, యూత్ కాంగ్రెస్ కరీంనగర్ జిల్లా కార్యదర్శి సజ్జు మాట్లాడుతూ, జమ్మికుంట మున్సిపాలిటీలోని పలు వార్డులలో మున్సిపాలిటీకి ఎలాంటి సంబంధం లేని వ్యక్తులను కొందరు నాయకులు కావాలని ఇంటి నెంబర్లు కేటాయించి అక్రమంగా ఓటరు జాబితాలో నమోదు చేస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి దొంగ ఓట్లు ప్రజాస్వామ్య వ్యవస్థకు తీవ్ర విఘాతం కలిగిస్తున్నాయని, ఇది ప్రజల ఓటు హక్కును దోచుకునే చర్యగా భావించాల్సి ఉంటుందన్నారు. ఈ వ్యవహారంపై అధికారులు తక్షణమే సమగ్ర విచారణ చేపట్టి అక్రమంగా నమోదు చేసిన ఓట్లను గుర్తించి వెంటనే తొలగించాలని వారు డిమాండ్ చేశారు. అలాగే బోగస్ ఓట్లను పూర్తిగా గుర్తించి ఓటరు జాబితాను శుద్ధి చేసి, రానున్న మున్సిపాలిటీ ఎన్నికలు పూర్తిస్థాయి ప్రజాస్వామ్య పద్ధతిలో జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఈ దొంగ ఓట్ల (వోట్ చోరీ) వ్యవహారంపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా రానున్న మున్సిపాలిటీ ఎన్నికల్లో ప్రజలంతా యువ నాయకత్వాన్ని ప్రోత్సహించి ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాలని యూత్ కాంగ్రెస్ నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి దొడ్డే సంధ్యా నవీన్, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శులు పంజాల అజయ్, ప్రశాంత్ సన్నీ, జమ్మికుంట మండల ఉపాధ్యక్షులు దేవునూరి వినయ్, ఆకినపల్లి శ్యామ్, సేవాదళ్ పట్టణ అధ్యక్షులు బండి పవన్, వార్డు సభ్యులు



తాళ్లపెల్లి అంజి, అజ్జు, నాయకులు జావిద్, పాతకాల ప్రవీణ్, యేబుషి అజయ్, ఇటుకల గణేష్, సూర్యతేజ రెడ్డి, సాయి తేజ, భగవాన్, అస్సాన్ తదితరులు పాల్గొన్నారు

## ట్రాక్టర్ డ్రైవర్ అజాగ్రత్త - విధులకు వెళ్తున్న స్టాఫ్ నర్సు ప్రాణం బలికొంది



**సామాన్యుడి అస్త్రం బాల్కొండ :** మెండోరా మండల కేంద్రం లోని పోచంపాడ్ పాఠశాల స్టాఫ్ నర్సు మధ్యాహ్నం లంచ్ చేసి తిరిగి విధులకు వెళ్తుండగా తిన్నది అరగకముందే ట్రాక్టర్ రూపంలో మృత్యువు అనంతలోకానికి తీసుకువెళ్లింది. ఈ ఘటన మెండోర మండలం పోచంపాడ్ గ్రామంలో చోటుచేసుకుంది. స్థానిక ఎస్ఐ వివరాల ప్రకారం పోచంపాడు గ్రామానికి చెందిన బొమ్మల ప్రియాంక వయస్సు 43 సంవత్సరాలు అదే గ్రామంలోని సోషల్ వెల్ఫేర్ స్కూల్ లో స్టాఫ్ నర్సు గా పనిచేస్తున్నారు. మంగళవారం మధ్యాహ్నం లంచ్ చేసాక తన తమ్ముడి మోటార్ సైకిల్ పై స్కూల్ కి వెళుతుండగా వెనకవైపు నుండి వస్తున్న ట్రాక్టర్ డ్రైవర్ వేముల మహేష్ తన ట్రాక్టర్ ను అతివేగంగా అజాగ్రత్తగా నడుపుతూ మోటార్ సైకిల్ కు తక్కరివ్వగా వారికి గాయాలు అయ్యాయి . ప్రియాంకను నిర్మల్ ఆసుపత్రికి తరలిస్తున్న సమయం లో ఆమె చనిపోయినట్లు గా మృతురాలి తమ్ముడు ఇచ్చిన పిర్యాదు నిమిత్తం కేసు రిజిస్టర్ చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుహాసిని తెలిపారు.

## పేదోడి బతుకు చిత్రం

సచ్చినోడి శవం మీద బతికినోడి బట్ట కప్పినట్టు

నాకున్నదొక్కటే ఒక బట్ట

నాదసలే బక్క పొట్ట



**సామాన్యుడి అస్త్రం కరీంనగర్:** నా పొట్ట దాచుకున్న బట్ట... లాగేసిన త్రాష్టుడెవ్వడు...? అయ్యో అది...యాడుందో...?ఎక్కడుందో ...? ఈ...శవాల గుట్టల నడుమ ఎక్కడ...ఎక్కడ...ఎక్కడని వెతికి వెతికి వేసారి అలిసి అక్కడే కలిసిపోయే...స్థితి నాకెవడిచ్చే...? మా ఇండ్ల ముందు మా వీధిలో మా వాడల్లో పచ్చని మొక్కలు మొలవక ఎన్నేళ్లయిందో...? గుబురు చెట్లే...మా గూళ్ళు ఆకులో... రేకులో అంతంత మాత్రమే మా బతుకులు పెద్దపెద్ద నివాసాలు కనుచూపుమేరలో కూడా మా వాడల్లో కనిపించవు..! చిల్లు పట్టిన జేబుల లాగు దుమ్ము పట్టి సిలుకోయ్యకు వేలాడుతోంది వారసత్వపు వరస రాజకీయాలు అదే కోవలో చలనచిత్రాలు... అక్కడ ఎక్కడ చూసినా మా చిరునామా దొరకదు...! కనీసం మా పేరైనా వినపడదు!! జాగ...మాదాయే! జనం మేమాయే!! శ్రమ మాదాయే! చెమట మాదాయే!! ధనం మాత్రమే మీదెట్లాయే రా...?నాలో చైతన్యపు వెలుగులు రాకుండా...లేకుండా చిమ్మ చీకట్ల గుహల్లో మగ్గుతున్న బలహీన సింహాల్ల బతు కీడ్చేలా చేసిందెవరు...? నావోడా...నివోడా ఎవడో చెప్పరా కారు చీకట్లో వాన్ని ఉన్న పలంగా కాల్చి పడేస్తా...! మూలిగే నక్క మీద తాటి పండు పడ్డట్టు ఒంటిమీద నూలు పోగు లేక ఎముకల గూడుతో వణుకుతుంటే నిత్యం చిచ్చులతో రగులుకుంటున్న విషం తో నిండుకున్న ఉత్తరం గాలి మామీదికి వచ్చి మమ్మల్ని ఊగిసలాడిస్తోంది! సమస్యల వలయంలో ముంచి సతమతం చేస్తోంది!! దాన్ని మా పైకి విసిరింది ఎవడు...? ఓహో... ఆడేనా నిత్యం పరాయోడి పేరు తలుస్తూ...సొంతోళ్ళ మాన ప్రాణాలు దోచేటోడు నువ్వు పులుముకుంటున్న అలుముకుంటున్న రంగు నాకెందుకురా... పూ స్తావు ? మీ... కరుడుగట్టిన మూర్ఖ...స్వార్థపు... రాతి గుండెల తో రాజ్యమేలుతున్న రాజులారా వినిపించట్లేదా...? నిరుపేదల వాడకట్లలో ఆకలి మంటల అర్తనాదాలు ఇప్పుడే...ఇప్పుడే...పల్లె పొలిమేరలలో ఊరవతల ఉదయభానుడి దిక్కు చూసే అభాగ్యుల... కంచంలో మెతుకులు లెక్కపెట్టి వస్తున్న రారా బాబు నువ్వా నేనా తేల్చుకుందాం...! నువ్విచ్చిన ఎన్నికల హామీలలో సగం సంఖ్యకు తక్కువే ఉన్నాయి. పేదోడి కంచంలో అన్నం మెతుకులు... గుట్ల అఖిల్ వంశీ సామాన్యుడి అస్త్రం కరీంనగర్ జిల్లా ఇంచార్జి

## ఇల్లందకుంట మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా దారా సురేష్ ఏకగ్రీవ ఎన్నిక

**సామాన్యుడి అస్త్రం ఇల్లందకుంట మండలం :** ఇల్లందకుంట మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా ఇల్లందకుంట గ్రామ సర్పంచ్ దారా సురేష్ మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలంలో మొత్తం 18 మంది సర్పంచులు ఉండగా, వారిలో 10 మంది సర్పంచులు దారా సురేష్‌కు మద్దతు తెలపడంతో ఆయనను అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. మండలంలోని సర్పంచుల సమస్యలు, గ్రామాల అభివృద్ధి, ప్రభుత్వ పథకాల అమలుపై సమిష్టిగా పనిచేయాలనే ఉద్దేశంతో సర్పంచుల ఫోరాన్ని బలోపేతం చేసే దిశగా ఈ ఎన్నికలు జరిగాయి. నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఏర్పాటు ఈ సందర్భంగా సర్పంచుల ఫోరం నూతన కార్యవర్గాన్ని కూడా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు . అధ్యక్షుడిగా మర్రి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా తోడేటి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా బుస అశోక్, కోశాధికారిగా రేణిగుంట్ల శ్యామలను నియమించారు. అదేవిధంగా చింతం శ్రీలత, రమణారెడ్డి, సంపత్, మాధవి, శ్రీనివాసులులను సభ్యులుగా ఎంపిక చేశారు. మండల అభివృద్ధే లక్ష్యం నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు దారా సురేష్ మాట్లాడుతూ, మండలంలోని అన్ని గ్రామాల సమగ్ర అభివృద్ధే తమ ఫోరం ప్రధాన లక్ష్యమని తెలిపారు.



సర్పంచుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, గ్రామస్థాయిలో మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి పనుల వేగవంతం, ప్రభుత్వ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు చేరేలా కృషి చేస్తామని అన్నారు. సర్పంచుల మధ్య ఐక్యతను మరింత బలోపేతం చేసి, మండల అభివృద్ధికి కలిసి పనిచేస్తామని, అవసరమైనప్పుడు సర్పంచుల తరఫున పోరాటాలకు కూడా వెనుకాడబోమని ఆయన స్పష్టం చేశారు. అభినందనలు వెల్లువ నూతనంగా ఎన్నికైన సర్పంచుల ఫోరం అధ్యక్షుడు దారా సురేష్‌తో పాటు కార్యవర్గ సభ్యులను మండలంలోని సర్పంచులు, ప్రజాప్రతినిధులు అభినందించారు. ఈ ఫోరం ద్వారా మండల అభివృద్ధికి మరింత ఊపొస్తుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

## ముక్కోటి ఏకాదశి వేడుకలు కమలాపూర్‌లో ఘనంగా నిర్వహణ

భక్తులతో కిక్కిరిసిన దేవాలయాలు



**సామాన్యుడి అస్త్రం కమలాపూర్ :** హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలంలో ముక్కోటి ఏకాదశి వేడుకలు భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా మండలంలోని దేవాలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. ముఖ్యంగా మండల కేంద్రంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో తెల్లవారుజాము నుంచే భక్తుల సందడి అధికంగా కనిపించింది. ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఆలయంలో ఉత్తర ద్వారాన్ని తెరవగా, భక్తులు క్యూలైన్లలో నిలబడి ఉత్తర ద్వారం గుండా స్వామివారిని భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. ఉదయం నుంచే భక్తుల రాక కొనసాగడంతో ఆలయ ప్రాంగణం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. మండలంలోని ఇతర గ్రామాల్లోని దేవాలయాల్లో కూడా ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామాల్లో గృహాలన్నీ పండుగ శోభతో ముస్తాబయ్యాయి. ఎక్కడ చూసినా భక్తి వాతావరణం నెలకొనగా, ముక్కోటి ఏకాదశి వేడుకలు భక్తుల ఆనందోత్సాహాల మధ్య వైభవంగా సాగాయి.

## తిరుమలలో సీఎం రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్న దొంత రమేష్

హుజురాబాద్ అభివృద్ధికి నిధులు కేటాయించాలని వినతి

మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ కైవసం ఖాయం: దొంత రమేష్

**సామాన్యుడి అస్త్రం హుజురాబాద్ :** ముక్కోటి వైకుంఠ ఏకాదశి సందర్భంగా తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న తెలంగాణ ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారిని మాజీ టీపీసీసీ ఎస్సీ సెల్ జాయింట్ కన్వీనర్ దొంత రమేష్ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా హుజురాబాద్ నియోజకవర్గంలో ఇటీవల చోటుచేసుకుంటున్న రాజకీయ పరిణామాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చిన దొంత రమేష్, నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయించాలని కోరారు. మౌలిక సదుపాయాలు, ప్రజాప్రయోజన పనులకు తక్షణమే ప్రాధాన్యం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. వొడితల ప్రణవ్ నాయకత్వంలో కాంగ్రెస్ బలోపేతం ఈ సందర్భంగా దొంత రమేష్ మాట్లాడుతూ, హుజురాబాద్ నియోజకవర్గంలో వొడితల ప్రణవ్ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతమైందని పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా ప్రజల మధ్య ఉంటూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను విస్తృతంగా చేరవేస్తున్నారని తెలిపారు. రానున్న మున్సిపాలిటీ ఎన్నికల్లో జమ్మికుంట, హుజురాబాద్ మున్సిపాలిటీలను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలంతా కాంగ్రెస్ వైపే ఉన్నారని అన్నారు. వైకుంఠ ఏకాదశి శుభాకాంక్షలు



ముక్కోటి వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని హుజురాబాద్ నియోజకవర్గ ప్రజలకు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తన శ్రేయోభిలాషులకు వైకుంఠ ఏకాదశి శుభాకాంక్షలు తెలిపారు. కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీనివాసుని మంగళకరమైన దీవెనలు ప్రజలందరికీ కలగాలని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆ వైకుంఠనాథుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు

## మంగళగిరి ప్రజా దర్బారులో పాడేరు ప్రజల గళం

వితంతు పింఛన్లు, సీసీ రోడ్లు, తాగునీరు సత్వర పరిష్కారానికి గట్టి వినతి

రాష్ట్ర తెలుగు యువత కార్యనిర్వహక కార్యదర్శి కె. సురేష్ కుమార్





**సామాన్యుడి అస్త్రం పాడేరు :** అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు నియోజకవర్గంలో నెలకొన్న కీలక ప్రజా సమస్యలను రాష్ట్ర స్థాయికి తీసుకెళ్లి గట్టిగా వినిపించిన ఘట్టం మంగళగిరి ప్రజా దర్బార్‌లో చోటుచేసుకుంది. రాష్ట్ర తెలుగు యువత కార్యనిర్వహక కార్యదర్శి కె. సురేష్ కుమార్ మంగళవారం మంగళగిరిలో నిర్వహించిన ప్రజా దర్బార్‌కు హాజరై, పాడేరు నియోజకవర్గ ప్రజల తరఫున సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సంబంధిత అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో ఫోన్ ద్వారా మాట్లాడుతూ, నియోజకవర్గంలోని అనేక గ్రామాల్లో అర్హులైనప్పటికీ వితంతు పింఛన్లు మంజూరు కాకపోవడం తీవ్రంగా బాధిస్తోందన్నారు. సామాజిక భద్రతే లక్ష్యంగా ఉన్న ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కొరత ప్రజల జీవన ప్రమాణాలను దెబ్బతీస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా సీసీ రోడ్ల మంజూరు, తాగునీటి సమస్యల శాశ్వత పరిష్కారం అభివృద్ధి ప్రణాళికల్లో మొదటి ప్రాధాన్యతగా తీసుకోవాలని కోరారు. అభివృద్ధి అనే పదం నినాదంగా మాత్రమే కాకుండా, గ్రామస్థాయిలో ప్రజలకు స్పష్టంగా కనిపించేలా అమలు కావాలని స్పష్టం చేశారు. విద్య, వైద్య రంగాలకు పెద్దపీట వేస్తూ గ్రామాలకు మౌలిక సదుపాయాలు విస్తృతంగా కల్పించేందుకు కృషి చేస్తున్న కూటమి ప్రభుత్వానికి, ముఖ్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారికి ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా దర్బార్ అనంతరం మాజీ ఎమ్మెల్సీ అశోక్ బాబు గారిని మర్యాదపూర్వకంగా కలిసి, పాడేరు నియోజకవర్గ సమస్యలపై స్పందించినందుకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు తమర్బ గంతన్న, యూనిట్ ఇన్‌చార్జ్‌లు కొంతెలి వెంకట ప్రసాద్, అగ్రహారపు శ్రీను, తమర్బ కిషోర్, తేజా, వెంకట, చంటి తదితరులు పాల్గొని పాడేరు ప్రజల సమస్యలకు సంఘీభావం తెలిపారు.

## మేడారం అభివృద్ధిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి

**గ్రేటర్ వరంగల్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజనాల శ్రీహరి హర్షం**

**జనగాం :** చరిత్రలో కనివిని ఎరుగని రీతిలో ఈసారి మహా జాతర నిర్వహణ 200 ఏళ్లు పాటు చెక్కుచెదరకుండా నిలిచేలా గద్దెల శాశ్వత పునర్నిర్మాణం మేడారం అభివృద్ధిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టడం పట్ల గ్రేటర్ వరంగల్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజనాల శ్రీహరి హర్షం వ్యక్తం చేసారు.మొత్తం 251 కోట్లతో మేడారం సమగ్ర అభివృద్ధి గద్దెల విస్తరణకు 101 కోట్లు 4000 టన్నుల గ్రానైట్ తో గద్దెలకు ప్రాంగణ నిర్మాణం 750 మంది కోయ వంశీయుల పేర్ల పేర్లకు సంబంధించిన 7,000 పైగా శిల్పాలు 930 ఏళ్ల కొయ్యల తాళపత్ర గ్రంధాల ఆధారంగా శిల్ప రూపకల్పన 46 స్తంభాలతో 271 చ. మీ విస్తరణలో ప్రకారం 8 స్తంభాలతో వృత్తాకారం గద్దె నిర్మాణం 40 అడుగుల వెడల్పుతో 3 స్వాగత తోరణాలు 30 అడుగుల వెడల్పుతో 5 స్వాగత తోరణాలు 50 అడుగుల వెడల్పుతో ప్రధాన స్వాగత తోరణం బండారి మరి వెదురు వేప ఇప్ప తదితర 12 రకాల పవిత్ర

## న్యూ ఇయర్ వేడుకల పేరుతో చట్ట ఉల్లంఘనలు సహించేది లేదు

మత్తులో వాహనాలు నడిపితే కఠిన చర్యలు

హుకుంపేట సీఐ ఎస్. సన్యాసి నాయుడు హెచ్చరిక



**సామాన్యుడి అస్త్రం అల్లూరి :** నూతన సంవత్సర వేడుకలను బాధ్యతాయుతంగా, శాంతియుతంగా జరుపుకోవాలని హుకుంపేట మండల సీఐ ఎస్. సన్యాసినాయుడు ప్రజలకు, ముఖ్యంగా యువతకు కఠిన హెచ్చరికలు జారీ చేశారు. న్యూ ఇయర్ సందర్భంగా మత్తులో వాహనాలు నడపడం, అతిగా మద్యం సేవించి రోడ్లపై అల్లరి చేయడం, ప్రజల భద్రతకు ముప్పు కలిగించే చర్యలు చేపడితే ఏ మాత్రం సహించేది లేదని స్పష్టం చేశారు. మత్తులో డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్, హెల్మెట్ లేకుండా వాహనాలు నడపడం వంటి చట్ట విరుద్ధ చర్యలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేసి, వాహనాలను స్వాధీనం చేసుకోవడంతో పాటు అవసరమైతే అరెస్టులు కూడా చేస్తామని హెచ్చరించారు. ప్రజల భద్రతే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని, నూతన సంవత్సర వేడుకలు ఆనందంగా సాగాలంటే ప్రతి ఒక్కరూ చట్టానికి లోబడి వ్యవహరించాలని సీఐ సన్యాసిరావు కోరారు. శాంతి భద్రతల పరిరక్షణ కోసం మండల వ్యాప్తంగా పోలీస్ బందోబస్తు పెంచినట్లు తెలిపారు. యువత స్వీయ నియంత్రణ పాటిస్తూ, కుటుంబ సభ్యులు మరియు సమాజానికి మాదిరిగా నిలవాలని సూచించారు. న్యూ ఇయర్ వేడుకలను సురక్షితంగా, సంతోషంగా జరుపుకుంటేనే నిజమైన ఆనందం దక్కుతుందని ఆయన అన్నారు.

# ఆపరేషన్ చబూతర్!

## పక్కా వ్యూహాలతో ఆకతాయిలకు చెక్!



**హైదరాబాద్ :** హైదరాబాద్ నగర వ్యాప్తంగా ఏడాదంతా ఒకెత్తైతే, డిసెంబర్ 31వ తేదీ రాత్రి పరిస్థితి పూర్తిగా విభిన్నం. హద్దులు దాటిన ఆకతాయిల వెకిలి చేష్టలు, డ్రగ్స్ మత్తు తలకెక్కి మృగాలుగా మారిన చేసే ఆగడాలు, పీకల దాకా తాగి , మద్యం మత్తులో రోడ్డు ప్రమాదాలకు కారణమయ్యే మందుబాబుల ఓవర్ యాక్షన్.. ఇలా ఆ రాత్రి నూతన సంవత్సర వేడుకలు ఓవైపు, అంతే స్థాయిలో ఎంతో మంది అమాయకుల జీవితాల్లో విషాన్ని నింపే చీకట్లు మరో వైపు. ఈ పరిస్థితి ప్రతీ ఏడాది సర్వసాధారణమైనప్పటికీ , సాధ్యమైనంత వరకూ ప్రమాదాలు జరగకుండా, క్రైమ్ అదుపు చేసేందుకు పోలీసులు పడే పాట్లు అన్నీ ఇన్నీ కావు. ఈసారి డిసెంబర్ 31వ తేదీ ఆకతాయిల ఆట కట్టించేందుకు ఆపరేషన్ చబూతర్ పేరుతో రంగంలోకి దిగారు హైదరాబాద్ పోలీసులు..హైదరాబాద్ నగరంలో ఈ ఏడాది పోలీసులు వినూత్నంగా చేపట్టిన ఆపరేషన్ చబూతర్ అనేది న్యూ ఇయర్ వేడుకల పేరుతో జరిగే ఆగడాలను, చట్ట వ్యతిరేక కార్యకలాపాలను, నిబంధనలను ఉల్లంఘించి , అమాయకుల ప్రాణాలను తీసే సరదాలను అడ్డుకోవడం. ఈ ఆపరేషన్ చబూతర్ లక్ష్యం న్యూ ఇయర్ వేడుకల్లో క్రైమ్ సాధ్యమైనంత వరకూ కట్టడి చేయడం. ఒక్కమాటలో చెప్పాలంటే మీ వేడుకలు, ఇతర కుటుంబంలో విషాదాన్ని నింపకుండా చట్టపరిధిలో అవసరమైన అన్ని చర్యలు తీసుకోవడమే ఈ ఆపరేషన్ చబూతర్ లక్ష్యం.డిసెంబర్ 31వ తేదీ టార్గెట్ గా వారం రోజుల ముందు నుంచే హైదరాబాద్ నగర వ్యాప్తంగా ఆపరేషన్ చబూతర్ ను షురూ చేశారు పోలీసులు. అస్సలు కథ మరి కొద్ది గంటల్లో ప్రారంభం కానుంది. 31వ తేదీన సరదాల పేరుతో గీత దాటొద్దంటూ ముందు నుంచే నగర ప్రజలను అప్రమత్తం చేసారు పోలీసు ఉన్నతాధికారులు. గతంలో ఎన్నడూ లేనంతగా ఈ ఏడాది ఏకంగా నగరంలో 100కుపైగా ప్రాంతాల్లో ఏకకాలంలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను నిర్వహించబోతున్నారు. ఆరోజు రాత్రి నుంచి మరుసటి రోజు తెల్లవారుజామున 3గంటల వరకూ నాన్ స్టాప్ గా నగరవ్యాప్తంగా 126 ప్రత్యేక బృందాలతో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు కొనసాగనున్నాయి. ఈ తనిఖీలలో మద్యం సేవించి పట్టుబడితే ఈసారి ఏకంగా 6 నెలలు జైలు జీవితం , డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేయడంతో పాటు న్యూ ఇయర్ బంపర్ ఆఫర్ గా 10వేలు ఫైన్ వేయడం తప్పదం టున్నారు. ఇలా నగరంలో తప్పతాగి ప్రాణాలు తీసే వాహనదారులకు డిసెంబర్ 31వ తేది చుక్కలు చూపించనున్నారు పోలీసులు. న్యూయర్ రోజు ఫ్యామిలితో ఉంటారా లేక తప్పతాగి వాహనం నడిపి జైల్లో ఉంటారా మీరే తేల్చుకోండంటూ , మందుబాబుకు ఓపెన్ చాలెంజ్ విసిరారు.అంటే డ్రగ్స్ , డ్రగ్స్ ఉంటేనే పార్టీలో మజా అనేంతలా హైదరాబాద్ లో డ్రగ్స్ కల్చర్ పెరిగిపోయింది. అందులో న్యూ ఇయర్ పార్టీలంటే చెప్పక్కర్లేదు. ఈ నేపథ్యంలో డ్రగ్స్ సరఫరా ముఠాలపై ప్రత్యేక నిఘా పెట్టారు. టెలిగ్రామ్, వాట్సాప్ లలో కోవర్టు గ్రూపులలో డీల్స్ ఫిక్స్ చేస్తున్న ముఠాలను టార్గెట్ చేశారు. మత్తు పదార్థాలను సరఫరా చేస్తున్న కేటుగాళ్లలోను జల్లెడ పట్టేందుకు హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ పరిధిలో ఈగల్, టాస్క్ ఫోర్స్ టీమ్స్ ఎప్పటికప్పుడు మత్తుగాళ్లను ట్రాక్ చేసేందుకు పక్కా వ్యూహాలను సిద్ధం చేశారు. నగర సరిహద్దు ప్రాంతాల్లో తనిఖీలు ముమ్మరం చేయడంతోపాటు గంజాయి సరఫరాను కట్టడి చేసేందుకు ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగనున్నాయి. ఇప్పటికే పబ్ లో పార్టీల పేరుతో మత్తు పదార్ధాలు సరఫరా, అసాంఘిక కార్యకలాపాలు జరిగితే తాట తీస్తామంటూ సీరియస్ వార్నింగ్ ఇచ్చారు. అర్ధరాత్రి 1గంట తరువాత బార్ లు ఓపెన్ లో ఉంటే తస్మాత్ జాగ్రత్త అంటూ హెచ్చరిస్తున్నారు. ఇలా ఈ డిసెంబర్ 31వ తేది రాత్రి స్పెషల్ ఆపరేషన్ చబూతర్ పేరుతో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ , ఆకతాయిల బెండు తీసేందుకు సిద్దమయ్యారు.

# వైకుంఠ ఏకాదశి సందర్భంగా తెలుగు రాష్ట్రాలలో ఆధ్యాత్మిక శోభ



**హైదరాబాద్ :** వైకుంఠ ఏకాదశి సందర్భంగా తెలుగు రాష్ట్రాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. మంగళ వారం తెల్లవారుజాము నుంచే భక్తులు వైష్ణవ ఆలయాలకు తరలివెళ్లి.. ఉత్తర ద్వార దర్శనాలు చేసుకుంటున్నారు. తిరుమల శ్రీవారి ఆలయంలో తెల్లవారుజామునే ఉత్తర ద్వారాన్ని తెరిచారు. దీంతో భక్తులు పెద్ద ఎత్తున శ్రీవారిని దర్శించుకుంటున్నారు. వేములవాడలో రాజన్న ఆలయానికి అనుబంధంగా ఉన్న భీమన్న గుడిలో ఉత్తర ద్వార దర్శనాలు నిర్వహించారు..తెలంగాణలో యాదగిరిగుట్టలో ఉదయం 5.40 నిమిషాల నుంచి ఉత్తర గోపురం ద్వారా లక్ష్మీనరసింహస్వామి దర్శనానికి అనుమతిస్తున్నారు. భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలోనూ ఘనంగా వైకుంఠ ద్వార దర్శనం ప్రారంభమైంది. గరుడ వాహనంపై శ్రీరామచంద్రస్వామి, గజవాహనంపై సీతమ్మ, హనుమత్ వాహనంపై లక్ష్మణుడు దర్శనమిచ్చారు.వైకుంఠ ఏకాదశి సందర్భంగా ధర్మపురి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. కొండగట్టు శ్రీఆంజనేయస్వామి దేవస్థానంలో తెల్లవారుజాము నుంచే ఉత్తర ద్వార దర్శనానికి అనుమతిస్తుండటంతో భక్తులు క్యూలైన్లలో బారులు తీరారు. కామారెడ్డి జిల్లాలో శ్రీ వేంకటేశ్వర స్వామి, వేణుగోపాల స్వామి ఆలయంలోనూ వైకుంఠ ద్వార దర్శనం కోసం భక్తులు క్యూ కట్టారు.

## జనవరి 8 నుంచి హైదరాబాద్-విజయవాడ మార్గంలో

# భారీ రద్దీ అంచనా



**హైదరాబాద్ :** తెలుగు రాష్ట్రాల ప్రజలకు అతిపెద్ద పండుగైన సంక్రాంతి సమీపిస్తున్న వేళ, ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తెలంగాణ ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టింది. ముఖ్యంగా పండుగ సమయంలో అత్యంత రద్దీగా ఉండే హైదరాబాద్?విజయవాడ జాతీయ రహదారిపై ట్రాఫిక్ నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఉన్నతాధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారుమంత్రి మాట్లాడుతూ, జనవరి 8వ తేదీ నుంచే హైవేలపై వాహన రద్దీ గణనీయంగా పెరిగే అవకాశముందని అంచనా వేశారు. ఈ నేపథ్యంలో ప్రయాణికులు సురక్షితంగా, సజావుగా తమ గమ్యస్థానాలకు చేరుకునేలా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. రద్దీ ఎక్కువగా ఉండే రోజుల్లో హైవేలపై మరమ్మతులు లేదా ఇతర కారణాలతో లేన్‌లను మూసివేసే పనులను పూర్తిగా నిలిపివేయాలని సూచించారు. వాహనాల రాకపోకలకు అన్ని లేన్‌లు అందుబాటులో ఉండేలా చూడాలని స్పష్టం చేశారు.ట్రాఫిక్ జామ్‌లను నివారించేందుకు కీలకమైన ప్రాంతాల్లో, జంక్షన్ల వద్ద అదనపు ట్రాఫిక్ పోలీసులను మోహరించాలని మంత్రి ఆదేశించారు. అలాగే, ప్రయాణికులకు స్పష్టమైన సమాచారం ఇచ్చేలా సైన్ బోర్డులు, రాత్రి వేళల్లో కనిపించేలా హై విజిబిలిటీ బారికేడ్లను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రజలు సంతోషంగా పండుగను జరుపుకునేలా, వారి ప్రయాణం సాఫీగా సాగేందుకు ప్రభుత్వం పూర్తి బాధ్యతతో పనిచేస్తుందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి భరోసా ఇచ్చారు.

## గిరిజన విలేకరుల సేవా సంఘం కోశాధికారి టి. సునీల్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగింది

నిబద్ధత, సేవాభావానికి ప్రతీకగా సునీల్ పాత్రికేయుల మధ్య జనాదరణ వెల్లువ



**సామాన్యుడి అస్త్రం అల్లూరి:** అల్లూరి సీతారామరాజు జిల్లా ఆంధ్రప్రదేశ్ గిరిజన విలేకరుల సేవా సంఘం కోశాధికారి టి. సునీల్ జన్మదిన వేడుకలు జిల్లా పాత్రికేయుల సమక్షంలో అత్యంత ఘనంగా, ఆత్మీయ వాతావరణంలో నిర్వహించబడ్డాయి. సంఘ అభివృద్ధికి ఆర్థిక క్రమశిక్షణ, నిబద్ధత, సేవాభావాన్ని మూల సూత్రాలుగా చేసుకుని అహర్నిశలు కృషి చేస్తున్న ఆయన సేవలకు ఈ సందర్భంగా పలువురు పాత్రికేయులు ఘనంగా అభినందనలు తెలియజేశారు. సంఘ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాత్రికేయుల మధ్య కేక్ కటింగ్ నిర్వహించి, సునీల్ కి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు అందజేశారు. గిరిజన విలేకరుల హక్కులు, సంక్షేమం కోసం ఆయన నిరంతరం చేస్తున్న సేవలు సంఘానికి బలమైన పునాదిగా నిలుస్తున్నాయని, అందుకే ఆయనకు పాత్రికేయ లోకంలో విశేషమైన జన ఆదరణ లభిస్తోందని నాయకులు పేర్కొన్నారు. కోశాధికారిగా బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ, సంఘ ఆర్థిక వ్యవస్థను పారదర్శకంగా, సక్రమంగా నిర్వహిస్తున్న సునీల్ పాత్ర ప్రశంసనీయం అని పలువురు అభిప్రాయపడ్డారు. సమస్యల పరిష్కారంలో ముందుండి, గిరిజన విలేకరుల ఆశయాలను కార్యరూపంలోకి తీసుకువచ్చే దిశగా ఆయన చేస్తున్న కృషి మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ జన్మదినం సునీల్ జీవితంలో ఆరోగ్యం, ఆనందం, విజయాలు, కొత్త ఆశయాలు తీసుకురావాలని, ఇలాంటి మరెన్నో జన్మదినాలను ఆయన జరుపుకోవాలని సంఘ సభ్యులు అల్లూరి జిల్లా పాత్రికేయులు మనస్ఫూర్తిగా కోరుకున్నారు. ఈ వేడుకలు సంఘ ఐక్యతకు, పాత్రికేయుల పరస్పర స్నేహానికి ప్రతీకగా నిలిచాయని, కార్యక్రమం ఆత్మీయతతో పాటు ఉత్సాహంగా సాగిందని పాల్గొన్న పాత్రికేయులు తెలిపారు.

## సంతోషాల నడుమ నూతన సంవత్సర వేడుకలు నిర్వహించుకుందాం.

**-వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్**

**వరంగల్ :** సంతోషాల నడుమ నూతన సంవత్సర వేడుకలు నిర్వహించుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ప్రజలకు సూచించారు. నూతన సంవత్సర వేడుకలు సమీపిస్తున్న వేళ వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ప్రజలు ప్రశాంతవంతమైన వాతవరణంలో ఎలాంటి ఆవాంచనీయ సంఘటనలు జరగకుండా నూతన సంవత్సర వేడుకలు నిర్వహించుకోనేందుకు పలుసూచనలు చేస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ మంగళవారం ప్రకటన విడుదల చేసారు. డిసెంబర్ 31 రాత్రి నిర్వహించుకునే నూతన సంవత్సర వేడుకల సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనర్ పరిధిలో స్థానిక పోలీసులతో పాటు ట్రాఫిక్, టాస్ఫోర్స్, క్రైమ్, షీ టీమ్తో పాటు పెట్రోలింగ్ విభాగాలకు చెందిన పోలీసులు ముమ్మరంగా పెట్రోలింగ్ నిర్వహిస్తారు. ముఖ్యంగా ఈ వేడుకలను ప్రజలు అర్థరాత్రి 12.30 గంటల లోపు ముగించుకోవాల్సి వుంటుందని, ఈ నూతన సంవత్సర వేడుకుల సందర్భంగా ఏర్పాటు చేసే సంస్కృతిక కార్యక్రమాలకు నిర్వహకులు తప్పని సరిగా పోలీసు అధికారుల నుండి ముందస్తు అనుమతులు తీసుకోవడంతో పాటు, వేడుకలు నిర్వహించుకునే ప్రాంతంలో ఎలాంటి అశ్లీల నృత్యాలకు అనుమతి లేదని అలాగే కార్యక్రమాల నిర్వహణ ప్రదేశంలో తప్పనిసరిగా సిసి కెమెరాల ఏర్పాటు చేయడంతో పాటు సెక్యూరిటీ సిబ్బంది ఎర్పాటు చేసుకోవాల్సి వుంటుందని ఈ వేడుకలు జరిగే సమయంలో ఎలాంటి ట్రాఫిక్ సమస్యలతో పాటు పరిసర ప్రాంతాల్లోని ఇండ్లవారికి ఇబ్బందులు కలగకుండా తగు చర్యలు తీసుకోవాలని, వేడుకల్లో ఎలాంటి మత్తు పదార్థాల వినియోగించడం లాంటి చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని ప్రధానంగా ఈ వేడుకల వేళ యువకలు మద్యం సేవించి నిర్లక్ష్యంగా వాహనాలు నడుపుతూ డ్రంక్ అండ్ డ్రైవ్ తనీఖీల్లో పోలీసులకు చిక్కితే జరిమానతో పాటు జైలు శిక్ష విధించబడుతుందని, అలాగే వేగంగా వాహనాలు నడపడం, రోడ్లుపై వెళ్ళేవారిని ఇబ్బందికి గురిచేసే వ్యవహరిస్తే సదరు వాహనదారులకు చట్టపరమైన తిప్పలు తప్పవని, రోడ్లపై ట్రాఫిక్ సమస్యలు రాకుండా ట్రాఫిక్ సిబ్బందితో పాటు స్థానిక పోలీసుల అధ్వర్యంలో ట్రై సిటితో పాటు, గ్రామీణ ప్రాంతాల్లోను ముమ్మరంగా డ్రంక్ అండ్ డ్రైవింగ్ తనీఖీలు నిర్వహించబడుతాయని అలాగే ప్రజలకు ఇబ్బందులకు గురిచేసే విధంగా బహిరంగ ప్రదేశాల్లో నూతన సంవత్సర వేడుకలను నిర్వహిస్తే వారిపై తగు చర్యలు తీసుకోబడుతుందని పై అంక్షలను ఎవరైన అతిక్రమించినా, ఉల్లంఘించినట్లుగా ప్రజల దృష్టికి వస్తే వెంటనే డయల్ 100 నంబర్కు సమాచారం అందించడం ద్వారా తక్షణమే స్పందించి వారిపై కఠిన చర్యలు తీసుకోబడుతాయని, ఈ వేడుకలను ప్రజలు, యువత తమ ఇండ్లలోనే తమ కుటుంబ సభ్యులతో కల్సి సంతోషకరమైన వాతరణంలో నిర్వహించుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ప్రజలకు సూచించారు.

## నూతన సంవత్సర వేడుకలు శాంతియుతంగా జరుపుకోవాలి

**: జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్**

**నారాయణపేట :** నూతన సంవత్సర వేడుకలు నారాయణపేట జిల్లాలో ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని, నిబంధనలను ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ తెలిపారు. జిల్లా ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ... డిసెంబర్ 31 రాత్రి జాతీయ రహదారి, ప్రధాన రహదారులపై వేడుకలు నిషేధించబడ్డాయని ఎస్పీ పేర్కొన్నారు. ముఖ్యంగా మద్యం తాగి వాహనాలను నడపవద్దని, మితిమీరిన వేగంతో ద్విచక్ర వాహనాలు నడిపి ప్రమాదాలకు గురై తల్లిదండ్రులను క్షోభకు గురిచేయవద్దన్నారు. మద్యం దుకాణదారులు నిర్ణీత సమయం వరకే విక్రయాలు చేయాలన్నారు. అర్ధరాత్రి గుంపులు గుంపులుగా తిరుగుతూ.. ప్రజలను భయభ్రాంతులకు గురిచేయవద్దన్నారు.ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీస్ పెట్రోలింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకునేలా స్నేహపూర్వక వాతావరణంలో శుభాకాంక్షలు తెలుపుకోవాలని విద్యార్థులు, యువతకు సూచించారు. మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తూ షీ టీమ్స్ ప్రత్యేకంగా పర్యవేక్షణ చేపడతాయని స్పష్టం చేశారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ట్రాఫిక్, టాస్క్ ఫోర్స్, షీ టీమ్స్, పెట్రోలింగ్ బృందాలు అప్రమత్తంగా విధులు నిర్వహిస్తాయని తెలిపారు. డీజేలకు అనుమతి లేదని, బాణసంచా కాల్చడంపై నిషేధం ఉంటుందని తెలిపారు. నూతన సంవత్సర వేడుకల్లో డ్రగ్స్ వినియోగాన్ని అరికట్టేందుకు ప్రత్యేక తనిఖీలు చేపడతామని, డ్రగ్స్ సరఫరా చేసే ముఠాలపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. బార్లు, వైన్ షాపులు నిర్దేశిత సమయానికి మూసివేయాలని, మైనర్లకు మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. డ్రంకెన్ అండ్ డ్రైవింగ్ పరీక్షలు కట్టుదిట్టంగా అమలు చేస్తామని, మైనర్లకు వాహనాలు ఇచ్చే యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అర్థరాత్రి యువకులు నిర్లక్ష్యంగా అధిక వేగంతో వాహనాలు నడపకుండా, బైక్ రేసులు జరగకుండా పటిష్టమైన పోలీసు బందోబస్తు కొనసాగుతుందన్నారు.

# జనగామ అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ

**వైద్యం కోసం వచ్చిన వారి ఆకలి తీర్చిన సాయి తేజ కుటుంబ సభ్యులు**





**సామాన్యుడి అస్త్రం జనగామ** వైకుంఠ ఏకాదశి సందర్భంగా జి సాయి తేజ నానమ్మ తాతాజీ ఉపేంద్ర రాజయ్య జనగామ జిల్లా ఏరియా ఆసుపత్రి వద్ద వైద్యం కోసం వచ్చిన ప్రజలకు మహా అన్న సమర్పణ చేసి ఈ సందర్భంగా జనగామ అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంతెన మణికుమార్ ప్రధాన కార్యదర్శి వంగ భీమ్ రాజు మాట్లాడుతూ ఈరోజు వైకుంఠ ఏకాదశి సందర్భంగా మహా అన్న సమర్పణ కార్యక్రమాన్ని నిర్వహించిన జి సాయి తేజ కుటుంబ సభ్యులకు పేరుపేరునా ధన్యవాదాలు చేశారు ప్రతి ఒక్కరు సందర్భం ఏదైనా కానీ ఆకలితో ఉన్నవారికి ఒక పూట ఆకలి తీర్చాలని భారత దేశంలో ఆకలి చావులు లేకుండా నియంత్రణ లక్ష్యంగా ప్రతి ఒక్కరు మీ మీ గ్రామ స్థాయి పట్టణ స్థాయిలో సామాజిక సేవా కార్యక్రమంలో ప్రజలు యువత భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు ఈ సేవా కార్యక్రమంలో అమ్మ ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ కొయ్యడ రవి కవిత, విశ్వ, ఎర్రవెల్లి దివ్య, కొయ్యడ సూర్యతేజ, పండుగ నరేష్, బొట్ల సాయి, గద్ద సాయికుమార్, తదితరులు పాల్గొన్నారు

## 31 డిసెంబర్ వృధా ఖర్చు వద్దు మీరు పేదలకు చేసే సహాయమే ముద్దు



**సామాన్యుడి అస్త్రం జనగామ** జనగామ జిల్లా మరియు తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో నీ యువతకు జనగామ అమ్మ ఫౌండేషన్ ప్రత్యేక విజ్ఞప్తి రేపు 31 డిసెంబర్ అనగానే ఫుల్ దావత్ మందు విందుతో హల్చల్ చేస్తారు ఇలా కొన్ని చోట్ల అయితే డీజేలు లో టపాసులు భారీ సౌండ్ సిస్టంతో విచ్చలవిడిగా ఖర్చు చేస్తుంటారు మీరు అలా ఖర్చు చేసే బదులు ప్రభుత్వ బడులకు వెళ్లి పేద విద్యార్థులకు పెన్నులు బుక్కులు మీ మీ గ్రామాలలో పట్టణాలలో ఉన్న రోడ్ సైడ్ జీవిస్తున్న అనాథలకి అభాగ్యులకు నిరాశరులకి చలికి చెద్దర్లు పంచడం లేదా ఆహారాన్ని పేద ప్రజలకి గుడిసె వాసులకి అందించడం వల్ల ఎంతో పుణ్యం చేసుకున్న వాళ్లు అవుతారు కావున డిసెంబర్ 31 వృధా ఖర్చు చేయకుండా గవర్నమెంట్ హాస్పిటల్ లో నిరుపేదలకి ఆహారం అందించి జరుపుకుందాం యువతకి జనగామ అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంతెన మణికుమార్ వంగ భీమ్ రాజు విజ్ఞప్తి చేశారు

## పోచంపాడ్ బాలుర గురుకుల విద్యార్థుల హావ



**సామాన్యుడి అస్త్రం బాల్కొండ:** మెండోరా మండల కేంద్రం లోని పోచంపాడ్ బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులు ఈనెల 28,29 తేదీలలో నాగారంలోని రాజారాం స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఛాంపియషిప్ పోటీలలో పాల్గొన్న పోచంపాడు బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులు మొత్తం 18 పథకాలను సాధించి జిల్లాలో ఛాంపియన్లుగా నిలిచారని పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీ కే సురేందర్ గారు తెలిపారు. పథకాలు సాధించిన వారిలో ఎస్. నిహాల్ ఐదవ తరగతి 300 మీటర్స్ గోల్డ్ మెడల్, చరణ్ ఏడవ తరగతి 400 మీటర్స్ గోల్డ్ మెడల్, ఎం. విశాల్ తొమ్మిదవ తరగతి 600 మీటర్స్ గోల్డ్ మెడల్, పి. నవదీప్ సిక్స్ కేఎం గోల్డ్ మెడల్, బి. భూమేష్ 8 కేయం గోల్డ్ మెడల్, అంతేకాకుండా ఎస్. నిహాల్ ఫిఫ్త్ క్లాస్ 60 మీటర్స్మటర్స్ సిల్వర్ మెడల్, వై. వసంత్ ఏడవ తరగతి 100 మీటర్స్ సిల్వర్ మెడల్, కే సహర్ష్ తొమ్మిదవ తరగతి లాంగ్ జంప్ సిల్వర్ మెడల్, ఏ. కార్తికేయ రెండు కేఎం సిల్వర్ మెడల్, అన్వేష్ కుమార్ ఆరు కేఎం సిల్వర్ మెడల్, బి. భూమేష్ 400 మీటర్స్ సిల్వర్ మెడల్, రాహుల్ 800 మీటర్స్ సిల్వర్ మెడల్, అంతేకాకుండా తమ పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయిలో పాల్గొని పథకాలు సాధించడం ఎంతో ఆనందదాయకమని పాఠశాల ఏటిపి శ్రీమతి ఎం. అశ్విని మేడం గారు తెలిపారు. అంతేకాకుండా తమపాఠశాల విద్యార్థులు చాంపియన్షిప్ సాధించే విధంగా శిక్షణనిచ్చిన పిఈటి శ్రీ సంజీవ్ మరియు పిడి యు సాయికుమార్ లను డిప్యూటీ వార్డెన్ శ్రీ పి రాజేశ్వర్ రెడ్డి గారు అభినందించారు. మరియు జిల్లా క్రీడల్లో పాల్గొని పథకాలు సాధించడమే కాకుండా రాష్ట్ర క్రీడలకు ఎన్నికైన విద్యార్థుల పట్ల విద్యార్థులు ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

# ఘనంగా విద్యార్థి పోరాటాల వేగుచుక్క ఎస్.ఎఫ్.ఐ 56వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**విద్యా రంగ సమస్యలు పరిష్కరించేంత వరకు ఎస్.ఎఫ్.ఐ పోరాటం ఆగదు**



**సామాన్యుడి అస్త్రం జనగామ** విద్యార్థి పోరాటాల వేగుచుక్క ఎస్.ఎఫ్.ఐ 56వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జిల్లా కేంద్రం లోని నెహ్రూ పార్క్ వద్ద జరిగింది. ఈ సందర్భంగా స్వాతంత్రం, ప్రజాస్వామ్యం,సోషలిజం అనే ఆశయాలతో ఉన్న పథకాన్ని జిల్లా అధ్యక్షుడు పొదల లవకుమార్ అసిశాఖరించారు అనంతరం జిల్లా కార్యదర్శి దాసగాని సుమ మాట్లాడుతూ భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ 1970 వ సంవత్సరం లో కేరళ లో ని త్రివేంద్ర నగరం లో స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం, సోషలిజం లక్ష్యాల తో ,అధ్యయనం పోరాటం అనే నినాదాలతో డిసెంబర్ 30 న 8 మంది తోటి ఏర్పడినదుగు దేశంలోనే 30 లక్షల సభ్యత్వంతో అతిపెద్ద విద్యార్థి సంఘం ఇంకా ఆవిర్భవించింది నేడు దేశంలో చదువుతున్నటువంటి విద్యార్థులందరికీ నాణ్యమైన శాస్త్రీయ ఉచిత విద్య ప్రతి ఒక్క విద్యార్థికి అందాలని ఎస్ఎఫ్ఐ పోరాడుతుందని అన్నారు కానీ నిర్దేశంలో పరిపాలిస్తున్నటువంటి మతోన్మాద కేంద్ర బిజెపి ప్రభుత్వం విద్యార్థులకు వ్యతిరేకంగా నూతన విద్యా విధానాన్ని తీసుకొచ్చి ఏమైనా చరిత్రని వక్రీకరించే విద్యను నేడు విద్యార్థులకు అందిస్తుందని మండిపడ్డారు తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటికి కూడా విద్యాశాఖ మంత్రిని నియమించాలని పెండింగ్ లో ఉన్నటువంటి విడుదల చేయాలని సంక్షేమ హాస్టల్ లో ఉన్న విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు పేద విద్యార్థుల పక్షాన ఎస్ఎఫ్ఐ ఎప్పుడు పోరాడుతుందని అన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు మామిడాల రమేష్ భూక్యా యాకన్న జిల్లా సహాయ కృష్ణ భాష పాక జగన్ స్నేహ రమేష్ నాయకులు సాయి వెంకటేష్ సాత్విక్ నాగశ్రీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

# అభివృద్ధి కి నోచుకోని జనగామ

**యాసారపు కరుణాకర్**



**సామాన్యుడి అస్త్రం జనగామ** కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు అయినా జనగామ మండలం లో నీ గానుగుపహాడ్ బ్రిడ్జి పనులు పూర్తి కాలేదు అని చీటకోడూర్ వద్ద కల్వర్టు కూలిపోయినా కొత్త బ్రిడ్జి పనులు మంజూరు కాలేదు అని జాతీయ మానవ హక్కుల కమిటీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి యాసారపు కరుణాకర్ అన్నారు. బీఆర్ఎస్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పరస్పరం దూషించుకుంటూ సమస్యల నుండి ప్రజల దృష్టి మరల్చే పనులు చేస్తున్నారు అని దుయ్యబట్టారు.కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం లో అభివృద్ధి చేస్తున్నాము అని అంటున్న కాంగ్రెస్ నాయకులు గత రెండు సంవత్సరాల నుండి జనగామ నియోజకవర్గం కు ఎన్ని నిధులు తెచ్చారు ఎక్కడ అభివృద్ధి చేశారు అని నిలదీశారు. స్టేషన్ ఘనపూర్,పాలకుర్తి నియోజకవర్గాలకు వందల కోట్ల నిధులతో అభివృద్ధి జరుగుతుంది అని రెండు నియోజకవర్గాలకు ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు మంజూరు అయినాయి అని జనగామ కు ఇంటిగ్రేటెడ్ పాఠశాల ఎప్పుడు వస్తుంది అని నిలదీశారు.కొమ్మూరి ప్రతాపరెడ్డి మాజీ డిసిసి అధ్యక్షుడు గా ఎన్ని నిధులు తెచ్చారో తెలపాలని ప్రశ్నించారు.రెండు బ్రిడ్జి ల కు పది కోట్ల రూపాయల నిధులు తేలేని కాంగ్రెస్ నాయకులు అభివృద్ధి చేస్తున్నాము సిగ్గులేని మాటలు మాట్లాడుతున్నారు అని హేళన చేశారు. ఇప్పటికీ అయినా కాంగ్రెస్ నాయకులు రెండు బ్రిడ్జి ల కు నిధులు తేవాలని జనగామ లో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల,ఇంటిగ్రేటెడ్ పాఠశాల, చేర్యాల రెవెన్యూ డివిజన్ మంజూరు చేపించి మాట్లాడాలని సూచించారు.

# నూతన సంవత్సరం వేళ కఠిన భద్రతా చర్యలు



**సామాన్యుడి అస్త్రం ఇల్లందకుంట :** ఇల్లందకుంట మండలంలో స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు రోడ్లపై కేక్ కట్ నిషేధం మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నూతన సంవత్సర వేడుకల సందర్భంగా శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజల ప్రాణ భద్రత దృష్టిలో ఉంచుకొని ఇల్లందకుంట మండలంలో పోలీసులు కఠిన చర్యలు చేపడుతున్నట్లు ఎస్సై క్రాంతికుమార్ తెలిపారు. మండల ప్రజలకు ప్రకటన ద్వారా పలు కీలక సూచనలు జారీ చేశారు. నూతన సంవత్సర వేడుకల పేరుతో రోడ్లపై కేక్ కట్ చేయడం పూర్తిగా నిషేధమని ఆయన స్పష్టం చేశారు. మద్యం సేవించి వాహనం నడిపినట్లయితే భారీ జరిమానాతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ రద్దు, జైలు శిక్ష కూడా తప్పదన్నారు. ఈ నేపథ్యంలో మండలం అంతటా ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీ బృందాలను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. అతివేగం, ర్యాష్ డ్రైవింగ్, బైక్ రేసింగ్‌లకు పాల్పడితే వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా అధిక శబ్దం చేసే వాహనాలపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మైనర్ పిల్లలకు వాహనాలు డ్రైవింగ్‌కు ఇస్తే వాహన యజమానులు లేదా తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని ఎస్సై స్పష్టం చేశారు. అదేవిధంగా హోటళ్లు, రెస్టారెంట్లు తప్పనిసరిగా సమయ పాలన పాటించాలని, నిషేధిత పదార్థాల వినియోగం జరిగితే నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డిసెంబర్ 31తో పాటు జనవరి 1వ తేదీన మండలంలోని ముఖ్యమైన ప్రాంతాల్లో స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు వెంటనే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని సూచించారు. మండల ప్రజలందరూ బాధ్యతాయుతంగా నూతన సంవత్సర వేడుకలు జరుపుకొని పోలీసు శాఖకు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా ఇల్లందకుంట మండల ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు


## అక్రిడిటేషన్ కార్డుల పేరుతో జర్నలిస్టులను విడగొట్టొద్దు



**సామాన్యుడి అస్త్రం గజ్వేల్** జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వడానికి ఈ ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నెంబర్ 252 ను సవరించాలని టి యు డబ్ల్యూ జే (ఐ- 143)డిమాండ్ చేసింది. అసెంబ్లీ సమావేశాలు నడుస్తూ నేపథ్యం లో జర్నలిస్టుల అక్రిడిటేషన్ ల విషయం పై 252 జీవో సవరణ చేసే విషయాన్ని అసెంబ్లీ లో లేవనెత్తాలని ఉమ్మడి మెదక్ జిల్లా శాసన మండలి సభ్యుడు యాదవ రెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గజ్వేల్ నియోజకవర్గ అధ్యక్షులు గరిదాస్ నవీన్ కుమార్, ప్రధాన కార్యదర్శి మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టులకు కనీస హక్కుగా ఇచ్చే అక్రిడిటేషన్ కార్డులను భారీ స్థాయిలో తగ్గిస్తూ, డెస్క్ జర్నలిస్టులకు వేరుగా బ్యూరో జర్నలిస్టులకు వేరుగా రెండు కార్డుల విధానాన్ని తీసుకువచ్చి జర్నలిస్టుల మధ్య విభజన రేఖలు ఇస్తున్న 252 జీవోను వెంటనే సవరించాలని అన్నారు. గతంలో ఉన్న 239 జీవో ఆధారంగా 23 వేల కార్డులు రాగా నూతనంగా తీసుకొచ్చిన జీవోతో 13 వేల కార్డులు తగ్గనున్నాయని నూతనంగా వచ్చిన ఈ జీవోను బట్టి తెలుస్తుందనీ, ఇలా జరిగితే జర్నలిస్టులకు తీరని అన్యాయం ఈ ప్రభుత్వం చేసినట్లు అవుతుందన్నారు. ప్రస్తుతం అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో ఈ అంశంపై మీరు సభలో చర్చించి ప్రభుత్వానికి మీ ద్వారా తగు సూచన చేసి జీఓ సవరణ విషయంలో జర్నలిస్టు సమాజానికి మద్దతుగా నిలవాలని అన్నారు. ఈ కార్యక్రమం లో సభ్యులు కరుణాకర్, ఆభోద్దీన్, గణేష్ ,రాజు, ప్రవీణ్, మల్లేశం, ఖాదర్ పాషా, మురళి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ కోదండ రామాలయంలో వైభవంగా పూజలు, అభిషేకాలు

**ఆలయ ధర్మకర్త ఠాగూర్ కాళీ మహేశ్వర సింగ్**



**సామాన్యుడి అస్త్రం జనగామ** యశ్వంతపూర్ గ్రామంలో నూతనంగా నిర్మితమైనటువంటి శ్రీ శ్రీ సీత, లక్ష్మణ మరియు భక్తా ఆంజనేయ సమేత శ్రీ కోదండ రామాలయంలో ముక్కోటి ఏకాదశి పురస్కరించుకొని ఆలయ ధర్మకర్త శ్రీ ఠాగూర్ కాళీ మహేశ్వర సింగ్ ఆధ్వర్యంలో దేవాలయంలో స్వామివారికి అభిషేకములు,అలంకరణ,లక్ష తులసి పుష్పార్చనలు మరియు ఉత్తర ద్వారా దర్శనాలు అంగరంగ మహా వైభవముగా ఆలయ పూజారి ప్రవీణ్ ఆచార్య నిర్వహించడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ఠాగూర్ కాళీ మహేశ్వర సింగ్ మరియు కుటుబసభ్యులు, సందీప్ ఠాకూర్ , గ్రామ సర్పంచ్ బొల్లా సంపత్ యాదవ్ ,మాజీ సర్పంచ్ ప్రవీణ్ కుమార్, నాగేందర్, సంపత్, బాల్నే నరేష్ గౌడ్,బన్నీ,దామెర రమేష్ మరియు గ్రామస్తుల ఆధ్వర్యంలో ఎంతో ఘనంగా పూజలు నిర్వహించడం జరిగింది.

## రోడ్డు పై గుంతలు పూడ్చిన యువకులు



**సామాన్యుడి అస్త్రం జనగామ** జనగామ జిల్లా యశ్వశీతపూర్ గ్రామం నుండి వరంగల్ వైపు వెళ్లే మలుపు వద్ద చాలా కాలంగా గుంతలతో రోడ్డు ప్రమాదకరంగా ఉండి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదురుకుంటున్నారు, ప్రమాదాలు చోటుచేసుకొని ప్రాణాలు పోయే ప్రమాదం ఉండటంతో గమనించిన ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొట్ల మహేష్ మాదిగ మరియు యశ్వంతపూర్ కు చెందిన ఆటో డ్రైవర్ మామిడి దయాకర్ ఆ గుంతలను మట్టితో పూడ్చారు

## వేదిక్ మ్యాథ్స్ , అబాకస్ లో జిల్లా టైటిల్ కైవసం చేసుకున్న వెల్లటూర్ లిటిల్ ఫ్లవర్ విద్యార్థులు



**సామాన్యుడి అస్త్రం బాల్కొండ:** వెల్లటూర్ లిటిల్ ఫ్లవర్ హైస్కూల్ విద్యార్థులు జిల్లా స్థాయి సీనియర్ లెవల్ వేదిక్ మ్యాథ్స్ మరియు అబాకస్ పోటీలలో లిటిల్ పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లాస్థాయి టైటిల్ కైవసం చేసుకున్నారని పాఠశాల కరస్పాండెంట్ అజ్మత్ పాషా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన వివరిస్తూ జిల్లా స్థాయి సీనియర్ లెవల్ వేదిక్ మ్యాథ్స్ మరియు అబాకస్ లో మా విద్యార్థులు టైటిల్ కైవసం చేసుకోవడం ఆనందంగా ఉందని అన్నారు. వేదిక్ మ్యాథ్స్ విభాగంలో మనిదీప్ 9 వ తరగతి విద్యార్థి ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక అయ్యాడని మనిదీప్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావడం ఇది రెండవసారి అని సంతోషాన్ని వ్యక్తం చేశారు. మరియు అబాకస్ సీనియర్ లెవెల్ విభాగంలో ఉసికెల హన్విత 4వ తరగతి , హన్విక 5వ తరగతి విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పాఠశాల కరస్పాండెంట్ మరియు ప్రిన్సిపాల్ అజ్మత్ పాష పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు అభినందించారు.

# వంట నూనెను పదే పదే వేడి చేసి వాడుతున్నారా?



భారతీయ ఇళ్లలో వంట నూనె లేని రోజు ఉండదు. పచ్చడి, పులుసు, కూరలు, చిరుతిళ్లు - ఏ వంటకమైనా నూనెతోనే మొదలవుతుంది. ముఖ్యంగా డీప్ ఫ్రై చేసే పదార్థాల తర్వాత మిగిలిన నూనెను వడకట్టి మళ్లీ వాడేస్తుంటారు చాలా మంది. డబ్బు ఆదా అవుతుందని భావిస్తారు. కాచిన నూనెను మళ్లీ వాడే అలవాటు ఆరోగ్యానికి ఎంత ప్రమాదమో తెలుసా? పదే పదే వేడి చేసిన నూనెలో విషపదార్థాలు ఏర్పడతాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇవి శరీరంలోకి చేరి ఏం చేస్తాయి? ఏ రోగాలకు దారి తీస్తాయి? చాలా మంది ఇళ్లలో డీప్ ఫ్రై చేసిన నూనెను నిల్వ చేసుకుని మరుసటి రోజు కూడా వాడతారు. ఇది సాధారణ అలవాటుగా మారింది. కానీ, ఈ ప్రక్రియలో నూనెలో రసాయన మార్పులు జరుగుతాయి. అధిక ఉష్ణోగ్రతకు గురైన నూనెలో ఫ్రీ రాడికల్స్, ట్రాన్స్ ఫ్యాట్స్, ఆల్డిహైడ్స్ వంటి హానికర సమ్మేళనాలు పెరుగుతాయి. ఇవి శరీరంలో ఆక్సీకరణ ఒత్తిడిని పెంచి, కణాలను దెబ్బతీస్తాయి. ఫలితంగా గుండె జబ్బులు, డయాబెటిస్ వచ్చే అవకాశం ఉంది? మరి ఈ ప్రమాదం నుంచి ఎలా తప్పించుకోవాలి? నూనెను పదే పదే వేడి చేయడం వల్ల దానిలోని కొవ్వు ఆమ్లాలు విచ్ఛిన్నమై ఫ్రీ రాడికల్స్‌ను విడుదల చేస్తాయి. ఈ ఫ్రీ రాడికల్స్ శరీరంలోకి చేరి కొలెస్ట్రాల్‌ను పెంచుతాయి, ట్రైగ్లిజరైడ్స్ స్థాయిలను అసమతుల్యం చేస్తాయి. ధమనుల్లో ప్లాక్ పేరుకుపోవడం, వాపులు పెరగడం, ఇన్సులిన్ నిరోధకత పెరగడం వంటివి జరుగుతాయి. కాలక్రమేణా ఇవి గుండె జబ్బులు, టైప్-2 డయాబెటిస్, ఫ్యాటీ లివర్, క్యాన్సర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులకు దారి తీస్తాయి. పరిశోధనల ప్రకారం.. అధిక ఉష్ణోగ్రతలకు గురైన నూనెలో పాలీసైక్లిక్ ఆరోమాటిక్ హైడ్రోకార్బన్స్‌వంటి కార్సినోజెన్స్ కూడా ఏర్పడతాయి.

వాడిన నూనెను నిల్వ చేసే విధానంలోనూ చాలా మంది తప్పులు చేస్తారు. మూత పెట్టకుండా, వెలుతురు పడే చోట ఉంచితే ఆక్సీకరణ వేగంగా జరిగి ఫ్రీ రాడికల్స్ మరింతగా పెరుగుతాయి. మళ్లీ వాడాలనుకుంటే తాజా నూనెతో కలిపి వాడవచ్చు కానీ, అందులోని విష సమ్మేళనాలు పూర్తిగా తొలగిపోవు. పొద్దుతిరుగుడు నూనెకు బదులుగా పల్లి నూనె, ఆవ నూనె (మస్టర్డ్ ఆయిల్), కొబ్బరి నూనె, నెయ్యి వంటివి ఉపయోగించండి. ఇవి హై స్మోక్ పాయింట్ ఉండి, డీప్ ఫ్రైకు సురక్షితం. నెలకు ఒకసారి నూనె రకాన్ని మార్చడం వల్ల ఒమెగా-3, ఒమెగా-6 ఫ్యాటీ యాసిడ్స్ సమతుల్యత కాపాడబడుతుంది. ఈ చిన్న మార్పులతో గుండె, కాలేయం, మెదడు ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. మీ వంటశైలి మార్చుకుంటే.. ఆరోగ్యం మీ చేతుల్లోనే ఉంటుంది!

# అతిగా తింటే మెదడుకు హాని జరుగుతుందా?

మనం ఫుడ్ తినేటప్పుడు మన శరీరం నుంచి కొన్ని సిగ్నల్స్ విడుదలై అవన్నీ కలిపి కడుపు నిండిందని మెదడుకు ఒక సిగ్నల్ ఇస్తాయి. ఇందులో మన పేగులు జీవక్రియలు చేసే శక్తిని ఉత్పత్తి చేసే అణువులు హార్మోన్లు అన్నీ ఉంటాయి. ఈ హార్మోన్లనే పాంక్రియాస్ గ్రంథికి ఇన్సులిన్ విడుదల చేయాలని సిగ్నల్స్ ఇస్తాయి. సాధారణంగా మనం తినాలనే కోరిక కలిగితే.. అది ఇష్టమైన ఫుడ్ అయితే.. బాగా లాగించేస్తాం.. ఇంకా ఏదైనా పండుగ వచ్చిందంటే చాలా స్పెషల్‌గా ఫుడ్ రెడీ చేసుకుని ఎంతో ఇష్టంగా తింటాం. ఇలాంటి ఫెస్టివల్ డేస్‌లో చాలామంది ఇష్టమైన డైట్ ప్లాన్‌లన్నీ పక్కనపెట్టి మంచిగా ఫుడ్ లాగిస్తుంటారు. అయితే మనం తీసుకున్న ఆహారం మనం మెదడులో ఎన్నో ముఖ్యమైన పనులు చేసేందుకు ఉపయోగపడుతుంది. ఇందులో మన మెమరీ పవర్ ఏకాగ్రత వంటి అంశాలు కూడా ఉన్నాయి. సరైన విధంగా పద్ధతిగా తీసుకునే ఆహారం మన మానసిక ఆరోగ్యానికి కూడా సహాయంగా ఉంటుందని నిపుణులు అంటున్నారు. మనం ఫుడ్ తినేటప్పుడు మన శరీరం నుంచి కొన్ని సిగ్నల్స్ విడుదలై అవన్నీ కలిపి కడుపు నిండిందని మెదడుకు ఒక సిగ్నల్ ఇస్తాయి. ఇందులో మన పేగులు జీవక్రియలు చేసే శక్తిని ఉత్పత్తి చేసే అణువులు హార్మోన్లు అన్నీ ఉంటాయి. ఈ హార్మోన్లనే పాంక్రియాస్ గ్రంథికి ఇన్సులిన్ విడుదల చేయాలని సిగ్నల్స్ ఇస్తాయి. ఇది మన శరీరంలో చక్కర స్థాయిలను నియంత్రిస్తుంది. ఈ సిగ్నల్స్ అన్నీ మన పేగులలోని అన్ని భాగాల నుండి వస్తుంటాయి. పాంక్రియాస్ గ్రంథి ద్వారా విడుదల ఈ హార్మోన్ల నమూనా, వీటి నుంచి మెదడుకు వెళ్లే సంకేతాలు కడుపు నిండిన తర్వాత మనకు కలిగించే నిద్ర మత్తు సంబంధించినవి. కానీ ఖచ్చితంగా ఈ ప్రక్రియ ఎలా పనిచేస్తుంది అనే దానిపై ఇంకా చాలా రీసెర్చ్ చేయాలని వాషింగ్టన్ డిసి లోని నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ పరిశోధకులు తెలిపారు. అయితే ఎక్కువగా తిన్న తర్వాత రక్తప్రసరణ తగ్గదు అని పరిశోధనలు చెబుతున్నాయి. ఒకేసారి ఎక్కువగా తిన్న కూడా మన మెటబాలిజంపై కాస్త తక్కువ ప్రభావమే పడుతుందని పరిశోధకులు అంటున్నారు. పరిశోధకులు చేసిన అధ్యయనం ప్రకారం.. అప్పుడప్పుడు ఎక్కువగా తినడం అందరూ అనుకున్నంత ప్రమాదకరం కాదు అని తెలిపారు. అయితే ఈ అధ్యయనాన్ని కేవలం యువతపైనే, ఆరోగ్యకరమైన వ్యక్తులపైనే చేశామని దీనిపై మరింత పరిశోధన చేయాల్సి ఉందని వారు అంటున్నారు. ఎక్కువగా తినడం వల్ల చెడు ప్రభావం పడుతుందన్న గ్యారెంటీ లేదని పరిశోధకులు తెలిపారు. ఒక్కసారి అత్యధికంగా ఆహారాన్ని తీసుకోవడం వల్ల మన శరీరంపై జరిగే ప్రభావాలపై తక్కువ పరిశోధనలు ఉన్నప్పటికీ ప్రస్తుతం పరిశోధనలు మాత్రం మన మెదడుకి అంత ప్రమాదకరం కాదని సూచిస్తున్నాయి. కొన్ని అధ్యయనాల ప్రకారం ఒకసారి ఎక్కువగా తినడం మనం అనుకున్నంత ప్రమాదం కాదని నిపుణులు అంటున్నారు. అప్పుడప్పుడు ఎక్కువగా తినడం ఓకే కానీ అంతకుమించి తింటే శరీరంపై ఒత్తిడి పెరుగుతుందని.. వరుసగా ఐదు రోజులపాటు ఎక్కువగా తినడం వల్ల మన మెదడుపై దీర్ఘకాలిక ప్రభావాలు పడతాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.




# రోజూ ఇలా నడిస్తే కొవ్వు మంచులా కరుగుతుంది



నేటి కాలంలో బరువు తగ్గడం అనేది ఒక పెద్ద సవాలుగా మారింది. దీని కోసం చాలా మంది జిమ్‌లో గంటల తరబడి చెమటలు చిందిస్తుంటారు. మరికొందరు కఠినమైన ఆహార నియమాలు పాటిస్తుంటారు. అయితే అవేమీ లేకుండా కేవలం నడకతోనే బరువు తగ్గవచ్చని నిపుణులు చెబుతున్నారు. సాధారణంగా నడవటం కాకుండా కొన్ని చిట్కాలను పాటిస్తే సులభంగా స్లిమ్‌గా మారవచ్చు. నడక ప్రయోజనాలు: నడక కేవలం కేలరీలను బర్న్ చేయడమే కాకుండా శరీర జీవక్రియను వేగవంతం చేస్తుంది. జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. అన్ని వయసుల వారు చేయగలిగే అత్యుత్తమ వ్యాయామం ఇది. క్రమం తప్పకుండా నడవడం వల్ల కీళ్ల నొప్పుల ముప్పు కూడా తగ్గుతుంది. భోజనం తర్వాత: చాలా మంది తిన్న వెంటనే పడుకుంటారు. కానీ భోజనం చేసిన తర్వాత 10 నుండి 20 నిమిషాల పాటు వేగంగా నడవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు నియంత్రణలో ఉంటాయి. ఇది ఆహారం త్వరగా జీర్ణం కావడానికి, కొవ్వు పేరుకుపోకుండా ఉండటానికి సహాయపడుతుంది. పవర్ వాకింగ్: సాధారణంగా నడవడానికి, పవర్ వాకింగ్‌కు చాలా తేడా ఉంది. కొంచెం వేగంగా, చేతులను లయబద్ధంగా ఆడిస్తూ నడవడాన్ని పవర్ వాకింగ్ అంటారు. దీనివల్ల హృదయ స్పందన రేటు పెరిగి, కేలరీలు వేగంగా ఖర్చవుతాయి. ఇది మోకాళ్లపై తక్కువ ఒత్తిడిని కలిగిస్తుంది. మెట్లు ఎక్కడం: చదునైన నేలపై నడవటం కంటే మెట్లు ఎక్కడం లేదా ఎత్తు పల్లాల ఉన్న చోట నడవడం వల్ల ఎక్కువ శ్రమ అవసరమవుతుంది. ఇది మీ తొడలు మరియు పొట్ట కండరాలపై ఒత్తిడిని పెంచి, మొండి కొవ్వును సైతం కరిగించేలా చేస్తుంది. కొంచెం బరువుతో నడక: నడుస్తున్నప్పుడు వెనుక చిన్న బ్యాక్‌ప్యాక్ ధరించడం లేదా తేలికపాటి బరువులు చేతిలో పట్టుకోవడం వల్ల శరీరం మరింత కష్టపడాల్సి వస్తుంది. దీనివల్ల తక్కువ సమయంలోనే ఎక్కువ కేలరీలు బర్న్ అవుతాయి. ఇంటర్వెల్ వాకింగ్: ఒకే వేగంతో కాకుండా వేగాన్ని మారుస్తూ నడవండి. ఉదాహరణకు ఒక నిమిషం పాటు చాలా వేగంగా నడిచి, తర్వాతి నిమిషం నెమ్మదిగా నడవండి. ఇలా చేయడం వల్ల శరీరంలో కొవ్వు కరిగే ప్రక్రియ రెట్టింపు అవుతుంది.

# ఆమ్లెట్, ఉడికించిన గుడ్డు బరువు తగ్గడానికి ఏది మంచిది?





ప్రోటీన్‌కు గుడ్లు ఉత్తమం. అందుకే డైలీ గుడ్లు తినమని వైద్యులు సూచిస్తారు. అయితే బరువు తగ్గాలనుకునేవారికి ఉడికించిన గుడ్లు, ఆమ్లెట్‌లలో ఏది మంచిదనే సందేహం ఉంటుంది. ప్రోటీన్ పుష్కలంగా ఉండే ఆహారాల్లో గుడ్డుకు సాటిలేదు. అందుకే చాలా మంది తమ అల్పాహారంలో గుడ్లను ఖచ్చితంగా చేర్చుకుంటారు. అయితే గుడ్లను వండుకునే విధానాన్ని బట్టి వాటిలోని పోషకాలు, కేలరీల శాతం మారుతుంటాయి. ముఖ్యంగా బరువు తగ్గాలనుకునే వారికి ఉడికించిన గుడ్డు మంచిదా లేక ఆమ్లెట్ మంచిదా అనే సందేహం చాలా మందిలో ఉంటుంది. ఆరోగ్యపరంగా చూస్తే ఉడికించిన గుడ్డు అత్యుత్తమ ఎంపిక. దీనిని నూనె లేదా వెన్న లేకుండా కేవలం నీటిలో ఉడికిస్తారు. కాబట్టి అదనపు కొవ్వు చేరే అవకాశం లేదు. ఒక ఉడికించిన గుడ్డులో సుమారు 70 కేలరీలు మాత్రమే ఉంటాయి. ఇందులో ప్రోటీన్లు, విటమిన్లు, ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరానికి కావాల్సిన శక్తిని ఇస్తూనే బరువును నియంత్రణలో ఉంచుతాయి. ప్రయాణాల్లో కూడా వీటిని సులభంగా తీసుకువెళ్లవచ్చు. ఆమ్లెట్ తినడానికి చాలా రుచిగా ఉంటుంది.. కానీ దీని తయారీ విధానమే పెద్ద మైనస్. ఆమ్లెట్ వేయడానికి నూనె, నెయ్యి లేదా వెన్న వాడటం వల్ల కేలరీల శాతం పెరుగుతుంది. ఉపయోగించే నూనెను బట్టి ఒక ఆమ్లెట్‌లో 90 నుండి 200 కేలరీల వరకు ఉండే అవకాశం ఉంది. అయితే ఆమ్లెట్‌లో టమోటాలు, ఉల్లిపాయలు, పాలకూర, క్యాప్సికమ్ వంటి కూరగాయలు చేర్చడం వల్ల ఫైబర్, విటమిన్లు అందుతాయి. తక్కువ నూనెతో వేసుకుంటే ఇది కూడా మంచి పోషకాహారమే. బరువును వేగంగా తగ్గించుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్న వారు ఉడికించిన గుడ్లు తినడమే ఉత్తమమని నిపుణులు సూచిస్తున్నారు. ఎందుకంటే వీటిలో కొవ్వు శాతం చాలా తక్కువ. ఒకవేళ మీరు ఆమ్లెట్ తినాలనుకుంటే.. నాన్-స్టిక్ పాన్ ఉపయోగించి అతి తక్కువ నూనెతో, ఎక్కువ కూరగాయలు చేర్చి వండుకోవడం మంచిది. దీనివల్ల కడుపు ఎక్కువసేపు నిండుగా ఉన్న అనుభూతి కలుగుతుంది.

# క్యాబేజీలో ఇంత మ్యాటర్ ఉందా.. ఇది తెలిస్తే అస్సలు ముట్టుకోరు..



క్యాబేజీ దొరికింది కదా అని పచ్చిగా తినేస్తున్నారా.? అయితే కాస్త ఆగండి.! అలా తినడం వల్ల లేనిపోని రోగాలు కొనితెచ్చుకున్నట్టే. దీనిపై న్యూరాలజిస్ట్ హెచ్చరికలు జారీ చేశారు. ఆ వివరాలు ఏంటో ఇప్పుడు ఈ స్టోరీలో తెలుసుకుందామా మరి. మూర్ఛ బ్రెయిన్‌కు సంబంధించిన ఒక వ్యాధి. మెదడు పనితీరుకు సంబంధించి ఏదైనా ఆటంకం ఏర్పడినప్పుడు ఫిట్స్ వస్తుంది. ఫిట్స్ వచ్చినప్పుడు.. అవయవాలు వణకడం, ఆకస్మికంగా పడిపోవడం, తదేకంగా చూడటం, ఆందోళన, స్పృహ కోల్పోవడం, సైకోసిస్ వంటి లక్షణాలు కనిపిస్తాయంటున్నారు వైద్యులు. ఫిట్స్ చిన్న వయసులో బాధించడానికి పలు కారణాలని అంటున్నారు. అలాగని.. పెద్దయ్యాక రాదని చెప్పలేం. ఇది జీవితంలో ఎప్పుడైనా రావొచ్చంటున్నారు నిపుణులు. ఇది వారసత్వంగా తల్లితండ్రుల నుంచి సంక్రమిస్తుందా? ఆహారం ద్వారా మెదడులోకి చేరే పురుగులు కారణమా? తల్లిదండ్రులకు మూర్ఛ సమస్య ఉంటే అది పిల్లలకు వచ్చే ప్రమాదం ఉందనే విషయాన్ని గుర్తుంచుకోవాలంటున్నారు నిపుణులు. కొన్నిసార్లు మూర్ఛ వ్యాధిగ్రస్థులను ఆసుపత్రికి తీసుకెళ్లినా.. చికిత్స చివరి వరకు కొనసాగించకుండా మధ్యలోనే వదిలేస్తారంటున్నారు. ఈ కారణంగా వ్యాధి మరింత తీవ్రంగా మారుతుంది. అలాకాకుండా.. సమయానికి చికిత్స అందిస్తే 80 నుంచి 90 శాతం మూర్ఛ రోగులలో ఈ వ్యాధి కంట్రోల్ అవుతుందని చెబుతున్నారు. అలాగే క్యాబేజ్ ఆకులను వండకుండా పచ్చిగా తినడం వల్ల టీనియా సోలియం అనే పురుగు గుడ్లు మెదడులోకి చేరతాయని వాటి కారణంగా ఏర్పడే ఇన్ఫెక్షన్ తో మూర్ఛవ్యాధి రావచ్చని హెచ్చరించారు. న్యూరో సిస్టి సెర్కోసిస్ నివారించదగ్గ ఇన్‌ఫెక్షన్ అని ఢిల్లీ ఎయిమ్స్ న్యూరాలజిస్ట్ డాక్టర్ ప్రియాంక సెహ్రావత్ తెలిపారు. ఆరోగ్య నిపుణుల సూచనల ప్రకారమే ఈ సమాచారాన్ని మేం మీకు అందిస్తున్నాం. వీటిని పాటించే ముందు కచ్చితంగా మీ వ్యక్తిగత వైద్యుల సలహాలు తీసుకోవడమే మంచిది.




## బిగ్గెస్ట్ డిజాస్టర్ చిత్రంగా 'వృషభ'.. నష్టం ఎన్నికోట్లు అంటే..

మలయాళ ప్రముఖ నటుడు మోహన్‌లాల్‌కు ఈ ఏడాది బాగా కలిసొచ్చిందనుకుంటే.. తాజాగా విడుదలైన 'వృషభ' మూవీ తన కెరీర్‌లోనే బిగ్గెస్ట్ డిజాస్టర్‌గా నిలిచింది. 2025 మోహన్‌లాల్ నటించిన లూసిఫర్ (ఎంపురాన్) రూ. 268 కోట్లు, తుడరమ్ రూ. 235 కోట్లు, హృదయపూర్వం రూ. 100 కోట్ల క్లబ్‌లో చేరాయి. కానీ, ఈ ఏడాది చివరలో ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'వృషభ' భారీ నష్టాలను మిగిల్చింది. క్రిస్మస్ కానుకగా డిసెంబర్ 25న విడుదలైన 'వృషభ' మూవీ బాక్సాఫీస్ వద్ద 5రోజుల్లో రూ. 1.94 కోట్లు మాత్రమే వసూలు చేసింది. సుమారు రూ. 70 కోట్ల బడ్జెట్‌తో నిర్మించిన ఈ మూవీ దారుణమైన ఫలితాన్ని అందుకుంది. ఈ ఏడాది బిగ్గెస్ట్ డిజాస్టర్‌గా ఈ సినిమా ఉంది. ప్రాంతాల వారిగా 5రోజుల కలెక్షన్స్ ఇలా ఉన్నాయి. ఓవర్సీస్‌లో ఈ చిత్రం దాదాపు రూ. 25 లక్షలు, మలయాళంలో రూ. 1.01 కోట్లు, హిందీలో రూ. 8 లక్షలు, తెలుగు వెర్షన్ రూ. 32 లక్షలు, కన్నడ వెర్షన్ దాదాపు రూ. 4 లక్షలు మాత్రమే సాధించింది. ఫైనల్‌గా ఈ మూవీ రూ. 65 కోట్లకు పైగానే నష్టాన్ని మిగల్చడం ఖాయంగానే కనిపిస్తుంది. మోహన్‌లాల్ ప్రధాన పాత్రలో దర్శకుడు నందకిషోర్ 'వృషభ' చిత్రాన్ని తెరకెక్కించారు. తండ్రీ కొడుకుల చుట్టూ తిరిగే జన్మజన్మల కథగా ఈ మూవీ ఉంది. కొత్తదనం లేని కథతో ప్రేక్షకులకు విసుగు తెప్పించారని విమర్శలు ఉన్నాయి. ఇందులో కేవలం మోహన్‌లాల్ నటన మాత్రమే బాగుందని ప్రశంసలు వచ్చాయి. అజయ్, అలీ, అయ్యప్ప పి.శర్మ వంటి తెలుగునటులు ఈ మూవీలో కీలక పాత్రల్లో కనిపిస్తారు.

## స్టార్ దర్శకుడితో 'కమల్ హాసన్' సినిమా.. జరిగేపనేనా..?

సినిమా రంగంలో ఏదైనా జరగవచ్చు. ఎవరు ఎవరినైనా దర్శకత్వం వహించవచ్చు. అయితే కథే ఇక్కడ ప్రధానాంశం. అది సరిగా సెట్ కాకపోవడంతోనే రజనీకాంత్ హీరోగా సుందర్.సి దర్శకత్వం వహించాల్సిన చిత్రం తెర రూపం దాల్చలేదు. తాజాగా ఒక రేర్ కాంబో గురించి వార్త సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. అదేంటంటే కమలహాసన్ హీరోగా వెట్రిమారన్ దర్శకత్వంలో చిత్రం రూపొందే విషయమై చర్చలు జరుగుతున్నట్లు ప్రచారం ఉంది. కమలహాసన్ ఏ తరహా చిత్రాన్నైనా చేయగలరు. అయితే వెట్రిమారన్‌కు ఒక ముద్ర ఉంది. ఆయన చిత్రాల కథలు వెనుకబడ్డ వర్గాల ఇతి వృత్తం, నేరారోపణలకు బలైన యువత ఇతి వృత్తంతో ఉంటాయి. తాజాగా ఈయన శింబు హీరోగా అరసన్ అనే చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఉత్తర చెన్నైకి చెందిన గ్యాంగ్‌స్టర్స్ నేపథ్యంలో రూపొందుతున్న ఈ చిత్రాన్ని కలైపులి ఎస్.థాను తన వి.క్రియేషన్ పతాకంపై నిర్మిస్తున్నారు. అదే విధంగా నటుడు కమలహాసన్ తాజాగా స్టంట్‌మాస్టర్ల ద్వయం అన్బరివ్‌ల దర్శకత్వంలో నటిస్తూ, తన రాజ్‌కమల్ ఫిలింస్ ఇంటర్నేషన్ పతాకంపై నిర్మించే పనిలో బిజీగా ఉన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో వెట్రిమారన్ దర్శకత్వంలో కమలహాసన్ హీరోగా నటించే చిత్రం గురించి చర్చలు జరుగుతున్నట్లు ప్రచారం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. ఇందులో నిజమెంతోగానీ, ఇదే గనుక జరిగితే కచ్చితంగా వైవిద్యభరిత కథా చిత్రం అవుతుంది.



## డ్రాగన్ కంట కన్నీరు.. సల్మాన్ ఖాన్ గల్వాన్ మూవీపై చైనా మీడియా అక్కసు!

బాలీవుడ్ సూపర్ స్టార్ సల్మాన్ ఖాన్ నటిస్తున్న తాజా చిత్రం 'బ్యాటిల్ ఆఫ్ గల్వాన్' టీజర్ విడుదలైనప్పటి నుంచీ సరిహద్దు అవతల చైనాలో ప్రకంపనలు మొదలయ్యాయి. డిసెంబర్ 27న సల్మాన్ పుట్టినరోజు సందర్భంగా విడుదలైన ఈ టీజర్ సోషల్ మీడియాలో సంచలనం సృష్టిస్తుండటంతో, చైనా అధికారిక పత్రిక 'గ్లోబల్ టైమ్స్' ఈ సినిమాపై అక్కసు వెళ్లగక్కింది. భారత సైనికుల వీరత్వాన్ని చాటిచెప్పే ఈ చిత్రాన్ని అడ్డుకోవాలనే ఉద్దేశంతో చైనా మీడియా తన సంపాదకీయంలో పలు వివాదాస్పద వ్యాఖ్యలు చేసింది. బ్యాటిల్ ఆఫ్ గాల్వాన్ వాస్తవ సంఘటనల ఆధారంగా తీసిన సినిమా కాదని, కేవలం భారతీయుల్లో జాతీయవాదాన్ని రెచ్చగొట్టడానికి రూపొందించిన నేషనలిస్టిక్ మెలోడ్రామా అని చైనా కొట్టిపారేసింది. అంతేగాకుండా 2020 గల్వాన్ ఘర్షణల్లో భారత సైనికులే చొరబాటుకు పాల్పడ్డారని బుకాయిస్తూ.. సినిమాలో తమ సైన్యాన్ని విలన్లుగా చూపించడం సరికాదని చైనా వాదిస్తోంది. అలాగే అంతర్జాతీయ వేదికలపై చైనా సైనికుల మరణాల సంఖ్య గురించి భారత్ అబద్ధాలు ప్రచారం చేస్తోందని గ్లోబల్ టైమ్స్ ఆరోపించింది.



# నిజాన్ని మీరే బయటపెట్టాలి రోహిత్, కోహ్లికి మాజీ క్రికెటర్ విజ్ఞప్తి

టీమిండియా బ్యాటింగ్ దిగ్గజాలు విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ వారం వ్యవధిలోనే టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటించారు. ఈ ఏడాది మే నెలలో తొలుత రోహిత్ తన నిర్ణయాన్ని వెల్లడించగా.. కోహ్లి కూడా అదే బాటలో నడిచాడు. ఆస్ట్రేలియా పర్యటనలో భాగంగా బోర్డర్- గావస్కర్ ట్రోఫీలో వీరిద్దరు పరుగులు రాబట్టలేక ఇబ్బందిపడ్డారు. రోహిత్ మధ్యలో విరామం తీసుకుంటూ మ్యాచ్‌లు ఆడగా.. కోహ్లి పదే పదే ఆఫ్ స్టంప్ దిశగా వెళ్తున్న బంతిని ఆడే క్రమంలో దాదాపుగా ఎనిమిది సార్లు వికెట్లు పారేసుకున్నాడు. ఈ నేపథ్యంలో రో- కో ఆట తీరుపై తీవ్ర స్థాయిలో విమర్శలు వచ్చాయి. రోహిత్ టెస్టులకు స్వస్తి పలికితే బాగుంటుందనే డిమాండ్లు పెరగగా.. మేటి టెస్టు బ్యాటర్ అయిన కోహ్లి తప్పులను సరిదిద్దుకుంటే బాగుంటుందనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి.



### అనూహ్య రీతిలో

ఈ క్రమంలో ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ 2025-27లో భాగంగా తొలుత ఇంగ్లండ్ పర్యటన నేపథ్యంలో టీమిండియాలో రో- కో ఆడతారని ముందుగా సంకేతాలు వచ్చాయి. అయితే, అనూహ్య రీతిలో వీరిద్దరు టెస్టులకు గుడ్‌బై చెప్పేశారు. రోహిత్ శర్మ స్థానంలో టెస్టు పగ్గాలు చేపట్టిన శుబ్‌మన్ గిల్.. బ్యాటింగ్ ఆర్డర్‌లో కీలకమైన కోహ్లి నాలుగో స్థానాన్నీ భర్తీ చేశాడు.

### ఒత్తిడి చేశారు

అయితే, రోహిత్- కోహ్లి ఆకస్మిక రిటైర్మెంట్లపై భారత మాజీ క్రికెటర్ రాబిన్ ఊతప్ప తాజాగా ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. "ఇదైతే సహజమైన రిటైర్మెంట్‌లా అనిపించలేదు. ఈ విషయంలో వాళ్లు మాత్రమే నిజమేంటో చెప్పగలరు. నాకైతే ఇదేదో బలవంతంగా చేయించినట్లు అనిపిస్తోంది.

### నిజాన్ని మీరే బయటపెట్టాలి

రోహిత్ శర్మ ఆరు నెలల పాటు విరామం తీసుకుని.. ఫిట్‌నెస్ సాధించి తిరిగి వస్తే బాగుండేది. అదే జరిగితే తిరిగి అతడు ఫామ్‌ను అందుకునేవాడు. అతడిలో ఇంకా క్రికెట్ మిగిలే ఉంది. రోహిత్‌తో పాటు కోహ్లి కూడా కొన్నాళ్ల విరామం తర్వాత తిరిగి వస్తే బాగుండేది. ఏదేమైనా టెస్టు రిటైర్మెంట్ విషయమై వాళ్లు నోరు విప్పితేనే నిజం తెలుస్తుంది" అని రాబిన్ ఊతప్ప పేర్కొన్నాడు.

### ఇద్దరూ సిద్ధం

అదే విధంగా.. రోహిత్ శర్మ- విరాట్ కోహ్లి ప్రస్తుత ఫామ్ గురించి ప్రస్తావిస్తూ.. "సౌతాఫ్రికాతో వన్డేల్లో ఇద్దరూ అదరగొట్టారు. రోహిత్ అద్భుతమైన హాఫ్ సెంచరీలు సాధిస్తే.. కోహ్లి వరుసగా రెండు శతకాలు బాదాడు. ఇద్దరూ ప్రపంచకప్ టోర్నీకి సిద్ధంగా ఉన్నారు. ఇటీవలే రోహిత్‌ను కలిశాను. అతడు ప్రస్తుతం రిలాక్సింగ్ మోడ్‌లో ఉన్నాడు. ఆట పట్ల సంతృప్తిగా ఉన్నాడు. రోహిత్- విరాట్ పరుగుల దాహం ఇంకా తీరలేదు. ఇప్పటికే ఇద్దరూ దిగ్గజాలుగా పేరు తెచ్చుకున్నారు. అయినా సరే ఇంకా ఇంకా ఆడాలనే పట్టుదల వారిని మరిన్ని ఉన్నత శిఖరాలకు చేరుస్తుంది" అని రాబిన్ ఊతప్ప చెప్పుకొచ్చాడు.

## ఆర్సీబీకి భారీ షాకిచ్చిన ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్

వచ్చే ఏడాది (2026) జనవరి 9 నుంచి ప్రారంభం కాబోయే మహిళల ఐపీఎల్ 2026కు ముందు 2024 ఎడిషన్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు భారీ షాక్ తగిలింది. ఆ జట్టు స్టార్ ఆల్‌రౌండర్, ఆస్ట్రేలియా ప్లేయర్ ఎల్లిస్ పెర్రీ వ్యక్తిగత కారణాల చేత సీజన్ మొత్తానికి దూరం కానుంది. పెర్రీ స్థానాన్ని ఆర్సీబీ యాజమాన్యం దేశీయ ఆల్‌రౌండర్ సయాలీ సత్ఘరేతో భర్తీ చేసింది. సత్ఘరే గతంలో గుజరాత్ జెయింట్స్ తరఫున ఆడింది. ఈ సీజన్ వేలంలో సత్ఘరేను (30 లక్షలు) ఏ ఫ్రాంచైజీ తీసుకోలేదు. తాజాగా ఎల్లిస్ లీగ్ నుంచి తప్పుకోవడంతో సత్ఘరేను అదృష్టం వరించింది. ఎల్లిస్ వైదొలిగిన తర్వాత ఆర్సీబీలో నడినే డి క్లెర్క్ మాత్రమే నాణ్యమైన విదేశీ ఆల్‌రౌండర్‌గా ఉంది. ఎల్లిస్ ఆర్సీబీ 2024లో టైటిల్ సాధించడంలో కీలకపాత్ర పోషించింది. ఎల్లిస్‌కు డబ్ల్యూపీఎల్ మొత్తంలోనూ మంచి ట్రాక్ రికార్డు ఉంది. ఈ లీగ్‌లో 6 వికెట్ల ప్రదర్శన నమోదు చేసిన తొలి బౌలర్ ఎల్లిసే. ఈ లీగ్‌లో ఇప్పటివరకు 25 మ్యాచ్‌లు ఆడిన ఈ వెటరన్ ఆల్‌రౌండర్.. 8 హాఫ్ సెంచరీల సాయంతో 972 పరుగులు చేసి, 8.25 ఎకానమీతో 14 వికెట్లు తీసింది. డబ్ల్యూపీఎల్ 2026 ప్రారంభానికి ముందు ఢిల్లీ క్యాపిటల్స్‌కు కూడా భారీ షాక్ తగిలింది. స్టార్ ఆల్‌రౌండర్, ఆసీస్ ప్లేయరే అయిన అన్నాబెల్ సదర్‌ల్యాండ్ కూడా వ్యక్తిగత కారణాల చేత సీజన్ మొత్తానికే దూరం కానుంది. సదర్‌ల్యాండ్ స్థానాన్ని డీసీ యాజమాన్యం అలానా కింగ్‌తో భర్తీ చేసింది.



# స్పోర్ట్స్

## కోహ్లి - రోహిత్ వీడ్కోలు సహజంగా అనిపించలేదు.. ఏదో రోజు నిజం తెలియకపోదు..!



సుదీర్ఘ ఫార్మాట్‌కు సీనియర్ ఆటగాళ్లు రోహిత్ శర్మ విరాట్ కోహ్లి వీడ్కోలు పలకడంపై ఇప్పటికీ సందేహాలు వ్యక్తమవుతున్నాయి. స్వదేశంలో జూనియర్లు విఫలమవుతున్న వేళ రో-కో రిటైర్మెంట్‌ను వెనక్కి తీసుకోవాలనే డిమాండ్లు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో టీమిండియా మాజీ క్రికెటర్ రాబిన్ ఊతప్ప సంచలన వ్యాఖ్యలు చేశాడు. కోహ్లి, రోహిత్ వీడ్కోలుపై తనకు సందేహాలున్నాయని ఊతప్ప అన్నాడు. ఈ ఏడాది ఇంగ్లండ్ పర్యటనకు ముందు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లిలు టెస్టులకు అల్విదా చెప్పారు. ముందుగా హిట్‌మ్యాన్.. ఆ తర్వాత వారం రోజుల్లోనే విరాట్ సైతం 'నేనూ వైదొలుగుతున్నా' అని ప్రకటించాడు. దాంతో.. మరో రెండేళ్లు ఆడగల సామర్థ్యమున్న ఈ ఇద్దరూ ఒకరివెంట ఒకరు వీడ్కోలు పలకడం అందర్నీ షాక్‌కు గురి చేసింది. ఇదేంటీ.. ఉన్నట్టుండి రో-కో రిటైర్మెంట్ చెప్పేయడం ఏంటీ? అని అందరూ చర్చించుకున్నారు. మాజీ క్రికెటర్ రాబిన్ ఊతప్ప సైతం వీరిద్దరి వీడ్కోలును నమ్మలేకపోతున్నాడట. మంగళవారం తన సొంత యూట్యూబ్ ఛానెల్లో మాట్లాడుతూ "నాకెందుకో కోహ్లి, రోహిత్ టెస్టు రిటైర్మెంట్ సహజంగా అనిపించడం లేదు. ఎవరైనా వారిని వీడ్కోలు చెప్పాలని బలవంతం చేశారా? అనేది తెలియదు. కానీ.. ఏదో రోజు నిజం బయటకు రాకపోదు. కోహ్లి, రోహిత్ స్వయంగా తాము ఎందుకు టెస్టులకు హఠాత్తుగా వీడ్కోలు పలికామో చెబుతారని అనుకుంటున్నా. ఆస్ట్రేలియా పర్యటనలో రోహిత్ పరుగులు చేయలేదు. సో.. అతడు ఓ ఆరు నెలలు బ్రేక్ తీసుకొని ఫిట్‌నెస్ మీద దృష్టి పెడుతాడని భావించాను. ఎందుకంటే హిట్‌మ్యాన్ మళ్లీ రన్స్ కొడుతాడనే విషయంలో నాకెలాంటి సందేహం లేదు. అలాంటిది వీరిద్దరూ స్వల్ప వ్యవధిలోనే టెస్టులకు గుడ్ బై చెప్పారు. వీరిద్దరూ ఈ సంచలన నిర్ణయం ఎందుకు తీసుకున్నారో త్వరలోనే అందరికీ తెలుస్తుంది" అని ఊతప్ప అన్నాడు.

### కెప్టెన్సీ నుంచి తప్పిస్తారని

ఆస్ట్రేలియా పర్యటనలో విఫలమైన రోహిత్ శర్మను కెప్టెన్సీ నుంచి తప్పిస్తారనే వార్తలు వచ్చాయి. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్(%ఔజ%) 2025-27 సీజన్ కోసం కొత్త సారథిని నియమించేందుకు బీసీసీఐ సెలెక్టర్లు సిద్ధమవ్వడం, ఫామ్ లేమి హిట్‌మ్యాన్‌ను వీడ్కోలుకు పురిగొల్పి ఉంటాయని టాక్. 'మరి.. టెస్టులను ప్రాణంగా ప్రేమించే కోహ్లి ఎందుకు రిటైరయ్యాడు?' అనేది ఇప్పటికీ మిలియన్ డాలర్ల ప్రశ్న. మరోసారి కెప్టెన్సీ ఆశించిన విరాట్‌కు సెలెక్టర్లు కుదరని చెప్పారని.. అందుకే అతడు టెస్టులకు బైబై చెప్పాడని అంటారు. కానీ.. అసలు వీరిద్దరు సైలెంట్‌గా వైదొలగడానికి అసలు కారణమేంటో తెలిసే రోజు కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం వన్డేల్లోనే కొనసాగుతున్న రో-కో వచ్చే ఏడాది ప్రపంచకప్‌లో ఆడుతారా? లేదా? అనేది కూడా తెలియాల్సి ఉంది.

PRINTED AND PUBLISHED BY PANUTULA PRIYANKA, ON BEHALF OF PANUTULA PRIYANKA, PRINTED AT M/S.PARAHUSHAR PRINTING PUBLICATION, 1-4-36, SRINAGAR COLONY, MAHABUBABAD, WARANGAL TELANGANA -506101.AND PUBLISHED AT #H.NO.12-155, RAVINDER REDDY COMPLEX, NEAR HANUMANTEMPLE, IDA BOLLARAM MUNICIPALITY, JINNARAM MANDAL, SANGAREDDY DIST - 502325, TELANGANA STATE. EDITOR: PANUTULA PRIYANKA. RNI NO: TGTEL/25/A1872, Email: mathrubhoomiceo@gmail.com, Phone: 9182698313.